# సహకార సమాచారం

2017 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు





డిసెంబర్ - 2016

A.P. SAHAKARA SAMACHARAM




సహకార శాఖ అధ్వర్యములో నిర్వహించిన నగుదు రహిత లావాదేవీల కార్యశాలయందు ప్రసంగిస్తున్న ఆం.ప్ర. రాష్ట్ర సహకార బ్యాంకు అధ్యక్షులు శ్రీ పిన్నమనేని వెంకటేశ్వర రావు గారు. చిత్రంలో మంత్రివర్యులు శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గారు ముఖ్య కార్యదర్శి శ్రీ బి. రాజశేఖర్ గారు



సహకార శాఖ అధ్వర్యములో నిర్వహించిన నగుదు రహిత లావాదేవీల కార్యశాలయందు ఎం.పాస్. యంత్రాన్ని కర్నూలు డిసిసిబి అధ్యక్షులు శ్రీ ఎం. మల్లికార్జునరెడ్డి గారికి అందజేస్తున్న సహకార శాఖ మంత్రివర్యులు శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గారు



విజయనగరం జిల్లా గార్ల మండలంలోని తెట్టంగి పిఏసిఎస్ నందు డివిడెండు పంపిణీ చేస్తున్న ఆం.ప్ర. రాష్ట్ర గృహనిర్మాణ శాఖామాత్యులు శ్రీమతి కిమిడి మృణాళిని గారు



ఆం.ప్ర. రాష్ట్ర సహకార గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వారి 2017 డైరీ ఆవిష్కరిస్తున్న సహకార శాఖ మంత్రివర్యులు శ్రీ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గారు చిత్రంలో శ్రీ బి. శ్రీనివాసులరెడ్డి డిఆర్ / ప్రధాన కార్యదర్శి తదితరులు



విజయనగరం జిల్లా గార్ల మండలంలోని తెట్టంగి పిఏసిఎస్ నందు డివిడెండు పంపిణీ కార్యక్రమమునకు హాజరైన సభ్యులు



ఆం.ప్ర. సహకార శాఖ సర్వీస్ అసోసియేషన్ 2017 డైరీని అవిష్కరిస్తున్న సహకార శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ బి. రాజశేఖర్ ఐఏఎస్ గారు చిత్రంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ పణి పేర్రాజు మరియు యూనియన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పి. రామ్ మోహన్, జాయింట్ రిజిస్ట్రార్ గారు

# సహకార సమాచారం

సంపుటి : 1 డిసెంబర్ 2016 సంచిక : 05

Editor:
**Dr. Y. Ali Akbar Basha,**
M.A., M.Phil., Ph.D., HDCM., B.L
*Additional Register / Managing Director*
**A.P. State Coop. Union Ltd.,**

**Editorial Board**

**T. SOMLA,** *Principal,*
*Vijayawada Coop. Training Centre,*
*Vijayawada*

**V. SRINIVASU,** *Principal,*
*Ramadas Coop. Training Centre,*
*Rajahmundry*

**L. RAJA REDDY,** *Principal,*
*Rayalaseema Coop. Training Centre,*
*Ananthapur*

**K. RAMA MURTHY REDDY,** *Principal,*
*Kadapa Coop. Training Centre,*
*Kadapa*

*Printed and Published by :*
**Managing Director**
*on behalf of* **A.P. State Coop. Union Ltd.,**
*Vijayawada*
*Beside Sundaraiah Vignana Kendram,*
*A.P. Housefed Building, 2nd Floor,*
*Baghlingampally, Hyderabad.*
*Phone : 040-27674148*

**విద్యానిధి చెల్లింపుకై విజ్ఞప్తి**

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సహకార ఉద్యమ ప్రగతికి సహకార శిక్షణ, విద్యల యొక్క ఆవశ్యకతను గుర్తించి, విద్యానిధిని ఏర్పాటు చేసింది. దాని వినియోగానికి ప్రత్యేక సెక్షన్ 44 (ఎ), నిబంధన 36 (ఎ)ను చట్టంలో పొందుపరచిన విషయం విదితమే. ప్రస్తుతం ప్రతి సంఘం తన స్థూల ఆదాయం నుండి 1 శాతం, నిబంధన 36 (ఎ)లో పేర్కొన్న గరిష్ట పరిమితికి లోబడి సహకార విద్యానిధికి కేటాయించాలి. ఈ మొత్తం నుండి 30 శాతాన్ని ఆడిట్ నివేదిక అందిన ఒక నెలలోపు లేదా అక్టోబర్ 31 లోపు ఏది ముందైతే ఆ తేదీలోపల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ లి., విజయవాడ వారికి చెల్లించాలి.

– మేనేజింగ్ డైరెక్టర్

ఈ సంచికలో....

| | | |
|---|---|---|
| 1. | ముఖచిత్ర కథనం | 4 |
| 2. | సంపాదకీయం | 5 |
| 3. | విత్తన చట్టం అమలు - రైతుకు రక్షణ కవచం | 6 |
| 4. | వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలుగా పిఏసిఎస్‌లు | 8 |
| 5. | ప్రకాశం జిల్లాలో నష్టాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక | 10 |
| 6. | ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో ముఖ్య కార్య నిర్వాహణాధికారి విధులు - బాధ్యతలు - అధికారాలు | 12 |
| 7. | సహకార సంఘాలు - వినియోగదార్ల పరిరక్షణ చట్టం | 14 |
| 8. | పొడి దుక్కిలో నేరుగా (ఏరోబిక్) వరిసాగు | 15 |
| 9. | అమృతలూరు గ్రామీణ సహకార పరపతి సంఘం | 16 |
| 10. | బుచ్చిరెడ్డి పాలెం గ్రామీణ బ్యాంకుతో సహకార మధురిమలు | 18 |
| 11. | ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘము | 21 |
| 12. | పేదలకు భీమా - చంద్రన్న భీమా | 22 |
| 13. | భారతదేశంలో ఉచిత న్యాయ సేవ సౌకర్యం | 23 |
| 14. | ప్రకాశం జిల్లా ప్యాక్స్‌ల సిఇఓలు సహకార సంఘాల పనితీరుపై అధ్యయన నివేదిక | 24 |
| 15. | సహకార సంస్థల యందు స్థిరాస్తులపై తరుగుదల | 26 |
| 16. | ప్రగతిపథంలో గోగుంట విశాల సహకార పరపతి సంఘం, పెదపాడు మండలం | 27 |
| 17. | గ్రామీణ విద్యుద్దీకరణ - గ్రామీణ విద్యుత్ సహకార సంఘముల ద్వారా గ్రామీణాభివృద్ధి | 28 |
| 18. | "విషరహిత వ్యవసాయము" కోసం పాటుపడుదాం | 29 |
| 19. | జలమే జయ యజ్ఞము | 30 |
| 20. | 63వ అఖిల భారత సహకారవారోత్సవాలు | 32 |
| 21. | కామన్ అకౌంటింగ్ సిస్టం క్రింద వ్రాయవలసిన రిజిష్టర్లు - పుస్తకాలు | 34 |

# ముఖచిత్ర కథనాలు

## నగదు రహిత లావాదేవీల పెంపుకు సహకార రంగం సమాయత్తం కావాలి.

నల్లధనం, నకిలీనోట్ల చెలామణి, ఉగ్రవాదం, నక్సలిజం, మాదకద్రవ్యాల వ్యాపారం వంటి సమాజానికి చేటుకలిగించే రుగ్మతలనుండి దేశాన్ని కాపాడటానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడిగారు రూ 1,000, 500 నోట్ల రద్దు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ అటవీ, సహకార శాఖామాత్యులు శ్రీ బొజ్జల గోపాలకృష్ణరెడ్డి గారు పేర్కొన్నారు.

ది. 14-12-2016న తేదీన, విజయవాడ సబ్-కలెక్టర్ ఆఫీసు వద్ద జిల్లా సహకార కేంద్రబ్యాంకుల అధ్యక్షుల, ముఖ్య కార్యనిర్వహణాధికారుల, జిల్లా సహకార మార్కెటింగ్ సోసైటీల అధ్యక్షులు, సహకార శాఖ అధికారులకు నగదు రహిత లావాదేవీలపై నిర్వహించిన ఒకరోజు కార్యశాలకు మంత్రి హాజరైనారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు రాష్ట్రంలో 70 శాతం లావాదేవీలు నగదు రహితంగా జరిగేవిధంగా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారని, సహకార బ్యాంకులు, సంఘాలు కూడా యిందుకు అనుగుణంగా నగదు రహిత లావాదేవీల నిర్వహణకు వెంటనే సమాయత్తం కావాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు అధ్యక్షులు శ్రీ పిన్నమనేని వెంకటేశ్వరరావు గారు ప్రసంగిస్తూ, ఈ రోజున గౌరవమంత్రివర్యులు చేతుల మీదుగా ఎం.పాస్ యంత్రాలను జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు అందించడం ఆనందాయకమని, డిసెంబరు నెలాఖరుకు 947 ఎం.పాస్ యంత్రాలు, జనవరి 15వ తేదీనాటికి 2వేలుపై చిలుకు మైక్రో ఎటియంలను అందజేయనున్నట్లు తెలిపారు.

సహకారశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ బి. రాజశేఖర్‌గారు సహకార బ్యాంకులు మరియు సహకార సంఘాలలో నగదు రహిత లావాదేవీలు నిర్వహించవలసిన తీరును గురించి వివరించారు. కర్నూలు డిసిసిబి అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ పాలకవర్గ సభ్యులు శ్రీ ఎమ్. మల్లిఖార్జునరెడ్డి గారు మాట్లాడుతూ, పాతనోట్లను స్వీకరించే అవకాశం కల్పించడం వల్ల అనేక ప్రభుత్వరంగ సంస్థలు, స్థానిక సంస్థలు తమ బకాయిలను వసూలు చేసుకొని లాభపడ్డాయని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల ప్రత్యేక కమీషనర్ మరియు రిజిస్ట్రారు శ్రీ జె.మురళిగారు, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సీతామహాలక్ష్మిగారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఎం.డి. శ్రీ అలీ అక్బర్ బాషాగారు, నాబార్డు అధ్యక్షులు ఇతర ఉన్నతాధికారులు, జిల్లా సహకార అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## "తెట్టంగి పిఏసిఎస్‌ను సందర్శించిన రాష్ట్ర గ్రామీణ గృహనిర్మాణ శాఖామాత్యులు శ్రీమతి కిమిడి మృణాళిని గారు "

విజయనగరం జిల్లా గార్ల మండలంలోని తెట్టంగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన డివిడెండ్ పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ శాఖామాత్యులు శ్రీమతి కిమిడి మృణాళిని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రైతుల యొక్క ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలి అంటే రైతు పండించిన పంటల ఆదాయం కన్నా పెట్టుబడి తక్కువ ఉండాలని అప్పుడే వ్యవసాయం లాభదాయకంగా వుంటుందని, కాని రైతులు అవసరమయిన మేరకు ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం కాకుండా అధికంగా వాడడం వలన ఎకరానికి సుమారు పదివేల రూపాయలు ఎక్కువ పెట్టుబడి అవుతుందని దీనిని అరికట్టడానికి రైతాంగానికి అనేక విధాలుగా అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో అగ్రికల్చరర్ ఎక్స్‌టెన్షనల్ అధికారులను నియమించి వ్యవసాయములోని మెళకువలపై అవగాహన కల్పించడం మరియు వారంలో రెండు దినములు "పొలం పిలుస్తుంది" అనే కార్యక్రమం చేపట్టి రైతులకు అవగాహన కల్పించుట జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమమునకు తెట్టంగి పిఏసిఎస్ అధ్యక్షులు శ్రీ తిరుమలరాజు వెంకట నారాయణగారు, గుర్ల మండల పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి జమ్ము సత్యవతమ్మగారు, తెట్టంగి గ్రామ సర్పంచి శ్రీ తెన్నె సన్యాశి నాయుడు, జిల్లా మార్క్‌ఫెడ్ మరియు నాఫెడ్ డైరెక్టరు శ్రీ కె.వి. సూర్య నారాయణ రాజు, జిల్లా సహకార అధికారి శ్రీ ఎస్. వెంకటరావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి శ్రీ పి. బాంధవరావు, విజయనగరం డివిజనల్ సహకార అధికారి మరియు భీమసింగు చక్కర కార్మాగారం మేనేజింగు డైరెక్టరు శ్రీ డి. నారాయణ రావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సిఇఒ శ్రీ కె. జనార్ధన్ గారు, నాబార్డ్ డిడిఎమ్ శ్రీ ఇ. శ్రీనివాస్‌గారు, రాష్ట్ర సహకార యూనియన్ జోనల్ ఆఫీసరు శ్రీ కె. శ్రీనివాసరావు, డిసిసిబి ఆసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీమతి విజయలక్ష్మి, సంఘ సిబ్బంది, తదితరులు హాజరైనారు.



*సంపాదకీయం*

# సమాజం మరియు కుటుంబ వికాసం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**2017, జనవరి 2 నుండి 11 తేది వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాజ వికాసం, కుటుంబ వికాసం, నగదు రహిత లావాదేవీల కొరకు ఆర్థిక అక్షరాస్యత, వ్యాయామ విద్య మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో నూతన ప్రక్రియల ద్వారా మనోవికాసం కలిగించుట, ఆస్తుల పంపకం మరియు బహుమతుల ప్రధానం** ఈ ఐదు అంశాలతో నిర్వహిస్తున్నందున, దీనికి సంపూర్ణ మద్దతు అటు ప్రజలతోపాటు మన సహకార సంఘాలు కూడా అందించాలి. డిజిటల్ లావాదేవీల నిర్వహణలో ఇబ్బంది పడుతున్న గ్రామీణులకు అవగాహన, చైతన్యం కలిగించడానికై ప్రభుత్వం డిసెంబరులో పెద్దయెత్తున ప్రచార, అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. నాలుగో విడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం (2-1-17 నుండి 11-1-2017) సందర్భముగా గ్రామసభల్లో స్వచ్ఛంద కార్యకర్తలతో డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తుంది. ఆర్థికశాఖ అధికారులు కమాండ్, కంట్రోల్ రూం నుంచి ఈ ప్రయత్నాలను పర్యవేక్షిస్తున్నారు. అన్ని సహకార సంఘాల్లో కూడా ఇకపై డిజిటల్ లావాదేవీలతోనే వ్యాపార కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమైన అంశం

- ♦ రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సమాజ వికాసం కోసం ప్రతి గ్రామానికి 10 రకాలైన కనీస సౌకర్యాలు కల్పించింది. అవి అందరికి నాణ్యమైన విద్య, ఆరోగ్య రక్షణ, వ్యవసాయం అనుబంధ సంస్థల అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, సేవా రంగ అభివృద్ధి, 24X7 విద్యుత్ సరఫరా, రహదారులు మరియు సదుపాయాల అభివృద్ధి, సాంకేతిక సమాచారం, పౌరసేవలు, సమ్మిళిత అభివృద్ధి.
- ♦ రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ కుటుంబ వికాసం కోసం 15 రకాలైన సాంఘీక, ఆర్థిక రక్షణ కల్పించింది. అవి సాంఘీక భద్రత, పౌష్టికాహార భద్రత, భీమా భద్రత, విద్యుత్ భద్రత, ఆరోగ్య భద్రత, గ్యాస్ భద్రత (దీపం పథకం), నీటి భద్రత, గృహ భద్రత, పారిశుధ్య భద్రత, విద్యా భద్రత, పశుగ్రాసం భద్రత, ఉద్యోగ భద్రత, సమాచార భద్రత, వ్యక్తిగత భద్రత, అందరికి జీవించే భద్రత (ఆదాయ భద్రత).
- ♦ రాష్ట్రంలోని పౌరులు, వ్యాపార సంస్థలు, వీధి వ్యాపారులు ఖచ్చితముగా బ్యాంకు అకౌంట్ కలిగి ఉండి డిజిటల్ లావాదేవీల ద్వారా అనగా మొబైల్ వ్యాలెట్‌లు,రూపే కార్డులు, ఆధార్ అనుసంధాన చెల్లింపు విధానం, నెట్ బ్యాంకింగ్, డెబిట్ మరియు క్రెడిట్ కార్డుల ద్వారా వ్యాపార చెల్లింపులు జరుపుకోవాలి. జన్మభూమి కార్యక్రమం ద్వారా స్థానిక ఆర్థిక సంస్థలు డిజిటల్ లావాదేవీల గురించి ప్రచారం చేయటం, వంద శాతం నగదు రహిత లావాదేవీల కోసం సదుపాయాలు కల్పించి గ్రామ వికాసం కోసం కృషి చేయాలని సంకల్పించింది.
- ♦ వ్యాయామ విద్య మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో నూతన ప్రక్రియల ద్వారా మనోవికాసం కలిగించుటకు స్థానికంగా ఉన్న సాంస్కృతిక కార్యక్రమాలు అనగా రంగోలి, కూచిపూడి, ఇతర నాట్యాలు సాంప్రదాయ మరియు గ్రామీణ ఆటలు, ఫుడ్ ఫెస్టివల్స్, హరికథలు, మొ॥ వాటి ద్వారా మనోవికాసం పొందుట. ఈ కార్యక్రమాలు గ్రామ పంచాయతీ మరియు పురపాలక సంఘాల ద్వారా నూతన సంవత్సర వేడుకలతో ప్రారంభించి సంక్రాంతి పండుగతో ముగించి బహుమతులు అందిస్తారు.
- ♦ షెడ్యూల్ కులాలు మరియు షెడ్యూల్ తెగల వారికి ఆస్తుల పంపకం, పెన్షన్ల మంజూరు, చంద్రన్న భీమా, కొత్త రేషన్ కార్డులు మొ॥ పంపిణీ చేయటం జరిగినది. అంతే కాకుండా ఈ కార్యక్రమములో నిర్వహించిన సాంస్కృతిక మరియు క్రీడల పోటీలలో విజేతలకు అవార్డులు ఇవ్వటం జరిగింది. వ్యవసాయ ఉత్పత్తి, పశువుల పెంపకం, విద్యాభివృద్ధి, సాంఘీక సేవ, స్వయం సహాయక సంఘాలలో ప్రత్యేక ప్రదర్శన కనబరిచిన గ్రామీణులను గుర్తించి తగురీతిగ సత్కరించడం జరుగుతుంది.

గౌరవ నీయులైన ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాల్గవ విడత జన్మభూమి కార్యక్రమం 02.01.17 నుండి 11.01.17 వరకు పైన తెలిపిన అంశాలతో నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమంలో మన రాష్ట్రంలోని అన్ని శాఖల ప్రభుత్వ యంత్రాంగం గ్రామాలలో పర్యటించే సందర్భంగా అన్ని సహకార సంఘాలు అందులోని సంఘ ప్రతినిధులు, సిబ్బంది, సభ్యులు పాల్గొని తమ పరిధిలోని కుటుంబాలు, గ్రామాలు/వార్డుల వికాసానికి కృషిచేయాలని విజ్ఞప్తి.

**అన్ని సహకార సంఘాల ప్రగతిని ఆశిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలతో.**

**డా॥ వై. అలీ అక్బర్ బాషా**
మేనేజింగ్ డైరెక్టర్

# విత్తన చట్టం అమలు - రైతుకు రక్షణ కవచం



**ఆర్. శ్రీనివాస రావు,** లెక్చరర్
రామదాసు సహకార శిక్షణాకేంద్రం,
రాజమండ్రి

తెలుగు రాష్ట్రాల్లో నకిలీ విత్తనాలు రైతుల పొట్ట కొడుతున్నాయి. రెండు సంవత్సరాల కరువు తరువాత కాడి, మేడి చేపట్టి ఆర్థికంగా కాస్త వెసులు బాటు పొందాలనుకున్న వారికి నిరాశే మిగులుతోంది. ఖరీఫ్ కాలంలో ప్రధానమైన పత్తి, మిరప, వాణిజ్య పంటలకు సంబంధించి నకిలీ విత్తనాలే రైతుల్ని నిలువునా ముంచాయి. పత్తి వద్దని అంతకు ముందు రెండు రాష్ట్రాలు బారీ ఎత్తున ప్రచారం చేశాయి. అవి ప్రత్యామ్నాయంగా సూచించిన కూరగాయల పంటలు, ముఖ్యంగా మిరప సాగుకు తగిన నాణ్యమైన విత్తనాన్ని అందుబాటులో ఉంచ లేక పోయాయి. సరైన వాటిని సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వల్ల నకిలీ విత్తనాలు చొరబడ్డాయి. ప్రత్యేకించి పత్తి సాగు ప్రధానంగా జరిగే నల్లరేగడి భూముల్లో మేలైన ప్రత్యామ్నయం మిరప అని రైతులు భావించారు. రెండూ వాణిజ్య పంటలు కావడంతో వారు పెట్టుబడులకు వెనకాడ లేదు. విత్తనాలకు పెద్ద యెత్తున గిరాకీ ఏర్పడింది. కొన్ని కంపెనీలు దీన్ని అవకాశంగా మలచుకొని రైతులకు నకిలీలను అంటగట్టాయి. ఫలితంగా రైతులు అన్ని విధాల నష్టపోయారు. విత్తనాల అక్రమార్కులపై ఉక్కు పాదం మోపే నిబంధనలేవీ సంబంధిత చట్టంలో లేకపోవడం శోచనీయం. ప్రభుత్వ పరమైన పరిశోధనలూ పడకేయడంతో రైతులకు ప్రవేటు రంగమే దిక్కయింది. ఈ పరిణామాలన్నీ అంతిమంగా రైతాంగం పాలిట పిడుగుపాటుగా పరిణమించాయి.

పంటల సాగులో అత్యంత కీలకమైనది విత్తనమే. దాని నాణ్యతపైనే మిగతా ఉత్పత్తి కారకాల సామర్థ్యం ఆధారపడి ఉ ంటుంది. రైతులకు విఫణిలో లభించేవి రెండు రకాలు, అవి దృవీకరణ విత్తనాలు, ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనాలు. దృవీకరణ విత్తనాలు మొత్తం పంటల్లో అందుబాటుకు సంబంధించి కేవలం 40 శాతమే. అది కూడా స్వపరాగ సంపర్కం చెందే పంటలు ఎక్కువగా ఉన్న వాటిలో అంటే వరి, గోదుమ, అపరాలు, వేరు సెనగల్లోనే ఎక్కువ. ధ్రువీకరణ జరగాలంటే ముందు ఆ పంటల రకాల్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వంగడాల విడుదల కమిటీ లేదా కేంద్ర కమిటీ పరిశీలించాలి. అందుకు కనీసం అయిదారేళ్ళ సమయం పడుతోంది. ఆ లోపు ఈ రకాలు చీడ పీడలకు గురయ్యే అవకాశముంది. అందుకే ధ్రువీకరణ విత్తనాలు రైతుల నుంచి ఉన్న గిరాకీని బట్టి విపణిని ఆక్రమిస్తున్నాయి. అభివృద్ధి నాణ్యత దృవీకరణల్లో ప్రభుత్వం లేదా వ్యవసాయ విశ్వ విద్యాలయాల జోక్యం, అజమాయిషీ ఉండదు. ప్రైవేటు విత్తన సంస్థలే ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నాయి. అవే పూర్తి బాధ్యత వహించి, బరోసా ఇవ్వాల్సి ఉంటుంది. 1966 భారత విత్తన చట్టం ప్రకారం రైతులకు విఫణిలో అందుబాటులో ఉండి విత్తనానికి ధ్రువీకరణ కచ్చితం కాదు. “లేబిలింగ్’ మాత్రం కచ్చితం. పంట, వంగడం, మొలక శాతం, జన్యు భౌతిక స్వచ్ఛత, సంస్థ చిరునామా వివరాలు విత్తన సంచిపై ఉండాలి. ధ్రువీకృత విత్తనాలకైతే, లేబిలింగ్ వివరాలతో పాటు ధ్రువీకరణ పత్రమూ ఉండాలి.

ప్రస్తుతం దేశంలో సాగవుతున్న వాటిలో వాణిజ్య పంటలైన పత్తి, మిరపతో పాటు దాదాపు అన్ని కూరగాయ పంటల్లోనూ ప్రవేటు విత్తనాలే ఉన్నాయి. అవి కూడా సంకరవిత్తనాలు. కొన్ని రకాలు తక్కువ కాలంలో దిగుబడి ఇస్తాయి. నాణ్యత బాగుంటుంది. వీటికి సాగునీరు అందుబాటులో ఉంటే దిగుబడులు మరింత మేలుగా ఉంటాయి. ప్రభుత్వాలు నిర్ధేశించిన విత్తన మార్పిడి నిష్పత్తిని మెరుగుపరచడంలో హైబ్రీడ్లే ప్రధానమైనవి. అందుకే రైతులు ఆ రకాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆ ఆదరణను కొన్ని ప్రవేటు సంస్థలు తెగ సొమ్ము చేసుకుంటున్నాయి. సంకర రకాల్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేయకుండా, రెండో తరహా విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ఒకసారి రైతు విత్తన సంస్థల నుంచి సంకర రకాల్ని కొనుగోలు చేసి పొలంలో పండించినప్పుడు, మొక్కలన్నీ ఒకే రీతిగా ఉండి దిగుబడులని ఇస్తాయి. కానీ, అదే విత్తనం కాయల నుంచి గింజల్ని సేకరించి, విత్తనాలు చేసి అమ్ముతున్నారు. అవే రెండోతరం విత్తనాలు. అసలు సంకర రకాల్లో ఉండే తేజం వీటికి ఉండదు. దిగుబడులు గణనీయంగా పడిపోతాయి. కాయలు, గింజల్లో తీవ్రమైన వ్యత్యాసం ఉంటుంది. విఫణిలో సరైన ధరలు రావు. నాణ్యత అసలే ఉండదు. ఎరువులు, సాగునీరు ఎంత

అందించినా ఎదుగుదల ఉండదు. తెలంగాణ రాష్ట్రములోని ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఈ ఖరీఫ్ పంట కాలంలో సాధారణ మిరప విస్తీర్ణంతో పాటు, పత్తికి ప్రత్యామ్నయంగా మిరప వేశారు. నల్లరేగడి భూముల్లో, నీటివసతి ఉన్నచోట్ల వాణిజ్య పంటగాను రైతుల ఓటు ఈ పంటకే. ఒక్కసారిగా మిరప హైబ్రీడ్ విత్తనాలకు గిరాకీ పెరగడం, అంతకు ముందు సంవత్సరాల్లో నీటి ఎద్దడి వల్ల తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతాల్లో సైతం విత్తనోత్పత్తి దెబ్బతింది. విత్తన కొరత ఏర్పడింది.

విత్తన పంపిణిలో ఉన్న గిరాకీని, అక్రమార్కులు సొమ్ము చేసుకున్నారు. నాణ్యత చూడకుండా రెండోతరహా విత్తనాలు, నాణ్యతా పరీక్షల్లో విఫలమైన విత్తనాలను కొనుగోలు చేసి రైతులకు అంటగట్టారు. ఆ ప్రభావం పంట పూతపై పడింది. కొన్ని చోట్ల కేవలం శాఖీయోత్పత్తి ఉంటే, మరికొన్ని క్షేత్రాల్లో మొక్కలు ఎదగడం లేదు. కాయల పొడవులో, పరిమాణంలో వైవిధ్యాలున్నాయి. ఇలాంటివి నాణ్యమైనవి కావు. విఫణిలో ధర పలకవు. అందుకే రైతులు వీటిని నకిలీ విత్తనాలుగా గుర్తించి రోడ్డెక్కాల్సి వచ్చింది. దీని ప్రభావం వినియోగదారులపైన పడనుంది. రాష్ట్రం సొంతంగా చట్టంచేసుకొనే వీలులేదు. వ్యవసాయం రాష్ట్ర పరిధిలోనిది, విత్తనం కేంద్ర పరిధిలో ఉంది. విత్తన అక్రమాలకు ఇక తావులేకుండా గట్టి చర్యలు సూచనలతో కొత్త ప్రతిపాదనలను రాష్ట్రాలు కేంద్రానికి పంపించాలి. అత్యంత కఠిన శిక్షలు, భారీ మొత్తాల్లో జరిమానాలు ఉండి తీరాలి. విత్తన భీమాను విధిగా ప్రవేశ పెట్టాలి. విత్తనాల వైఫల్యముంటే, ఆయా ఉత్పత్తి సంస్థలే నష్ట పరిహారం చెల్లించేలా చర్యలుండాలి. "షేడ్‌నెట్" విధానం అందుబాటులోకి వచ్చిన దరిమిలా కొందరు అక్కడే కూరగాయల విత్తనాలు పెంచి నేరుగా నారును సరఫరా చేస్తున్నారు. నకిలీ విత్తనాల కేసుల్లో రైతు నష్ట పరిహారం పొందడానికి విత్తన సంచి, దాన్ని కొన్నప్పటి రశీదును సదరు కంపెనీ తీరుకు ఆధారంగా చూపించాలి. 'షేడ్‌నెట్' యజమానులు 25 నుంచి 30 రోజుల వరకు పెంచిన నారును ఆ తరువాతే రైతులు కొనుగోలు చేయడం వల్ల నష్ట పరిహారం కోరేందుకు ఎలాంటి ఆధారమూ ఉండటం లేదు. దీనికి తోడు షేడ్‌నెట్‌లలో పెంచినవి ప్రధానంగా అంటుకట్టిన పండ్ల మొక్కలు కాబట్టి రైతులు ఆయా నర్సరీల నుంచి కూరగాయల మొక్కలు కొనుగోలు చేసినా ప్రస్తుతానికి అవి చెల్లవు. అందువల్ల నర్సరీ చట్టంలో కూరగాయలను చేర్చాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాములో ఉన్న నర్సరీ చట్టాన్ని ఆమోదింపచేసుకోవడం తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరం.

అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోయినప్పుడు, రాష్ట్రాలు కేంద్రానికి నివేదికలు పంపిస్తుంటాయి. వాటిని కేంద్రం పరిశీలించి ఎంతో కొంత నష్టపరిహారం చెల్లిస్తుంది. దీన్ని కేంద్రం 33 శాతం నుంచి 50 శాతానికి పెంచింది. విత్తన చట్టంలో కాని, కేంద్రం పరిశీలనలో కానీ నకిలీ విత్తనం వల్ల రైతు నష్టపోతే పరిహారం పొందడానికి వెసులుబాటు లేదు. రాష్ట్ర ప్రభుత్వాలే ఇలాంటి సందర్భాల్లో రైతులకు నష్ట పరిహారం గురించి ప్రత్యేక చట్టం తేవాలి. గతంలో ఆదిలాబాద్‌లో నకిలీ పత్తి విత్తనాలు వాడి రైతులు నష్టపోయినప్పుడు, ఈ తరహా చట్టం చేసి పరిహారం అందేట్లు చూశారు. కేవలం పత్తికే వర్తించిన చట్టమిది. ఇక ముందు అన్ని పంటలకు వర్తించేలా సరికొత్త చట్టం తేవడం అత్యవసరం. కూరగాయల్లో దాదాపు అన్ని హైబ్రీడ్లు కావడం వల్ల ఎరువులు సాగునీరు అందుబాటులో లేకపోతే దిగుబడులు భారీగా పడిపోతాయి. కాబట్టి ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలు రూపొందించిన సూటిరకాలను మిరపసాగు ప్రాంతాలలో పరిశీలించి, తగిన చోట్ల సిఫార్సు చేయాలి. వీటితో విత్తనోత్పత్తి సులభం. అవసరమైతే రైతులే నేరుగా సొంతంగా విత్తనోత్పత్తి చేసుకోవచ్చు. నకిలీల సమస్య దాదాపుగా ఉండదు. విత్తనం విఫణిలోకి వచ్చేముందే, ప్రభుత్వం నిర్ణీత పరీక్ష ద్వారా స్వచ్ఛతను పరీక్షిస్తుంది. ఇందుకు పంటకాలం నాలుగు నుంచి ఐదు నెలలు పడుతుంది. దీనికి వాడే విత్తనం ధర ఎక్కువ. అందుకే పూర్తి స్థాయిలో నాణ్యతా పరీక్ష కుదరడంలేదు. ఇప్పటికే వరి, నూనె గింజల పరంగా ఉన్న ఆధునిక పద్ధతుల వల్ల తక్కువ ఖర్చుతో, తక్కువ కాలంలోనే నకిలీలను గుర్తించవచ్చు, నష్టాన్ని పూర్తిగా నివారించవచ్చు.

తెలంగాణా దేశంలోనే విత్తన బండాగారంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ లోను పెద్ద ఎత్తున విత్తనోత్పత్తి జరుగుతోంది. విత్తనాలను విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాం. అటువంటప్పుడు, సొంత రాష్ట్రాల్లోని రైతులకే నాణ్యమైన విత్తనం అందించలేకపోతే అంతకంటే అవమానం ఉండదు. ప్రభుత్వాలు గట్టి చట్టాలు, చర్యలతో నకిలీ విత్తనాల పీడ విరగడ చేయాలి. అప్పుడే రైతులకు మేలు చేకూరుతుంది. కావున విత్తన చట్టాలను రాష్ట్రం పరిధిలోనికి తీసుకొనివచ్చి రైతుకు రక్షణ కవచంలా ఉండేలా చర్యలు తీసుకొన్నప్పుడు అధిక దిగుబడితో పాటు ఆదాయం పెరిగి వ్యవసాయోత్పత్తి పెరుగుతుంది. దేశము సుభిక్షముగా ఉంటుంది.

# వరి ధాన్యము కొనుగోలు కేంద్రాలుగా పిఏసిఎస్‌లు



**జి.వి. రెడ్డయ్య,**
డిఆర్ / లెక్చరర్
ఆర్‌సిటిసి, రాజమండ్రి

**ఆవశ్యకత :**

- ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయమే ప్రాథమిక వృత్తిగా మరియు రైతులు విత్తనాలు విత్తినప్పటి నుండి చేతికి వచ్చిన పంటను అమ్మి డబ్బులు చేతికి అందేవరకు కష్టాలు పడుతూనే ఉన్నాడు.
- పంటకు కనీస మద్ధతు ధర రాక సరియైన సమయంలో చేతికి డబ్బులు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారు.

  ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిఏసిఎస్‌ల ద్వారా మరియు వెలుగు సెంటర్స్ ద్వారా అదనంగా వరి కొనుగోలు చేయవలెనని నిర్ణయించడం జరిగింది.
- తద్వారా రైతులు పండించిన వరి పంటను కనీస మద్ధతు ధరకు రైతుల నుండి నేరుగా సహకార సంఘాలు కొనుగోలు చేసి గత సీజను (ఖరీఫ్) లో విజయవంతంగా చేపట్టి రైతుకు చేయూతనిచ్చింది.



- ప్రస్తుతం రబీ సీజనులో కూడా సహకార సంఘాల ద్వారా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ జిల్లాలో ఏర్పాటు చేయుటకు సూత్రప్రాయంగా అంగీకరించి యున్నారు.

1. సంఘ బాధ్యతలు :

- ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మరియు సిఇఓలు చాలా బాధ్యతాయుతంగా నియమాలను పాటిస్తూ రైతు సోదరులకు సేవలందించి, సంఘాలు ఇటు లాభాల బాటలో పయనించుటకు మరియు రైతుకు మేలు చేయుటకు కృషి చేయాలి.
- కొనుగోలు కేంద్రంలో కావలసిన తరాజులు, తూనికలు, తేమ కొలిచే యంత్రము, టార్పాలిన్‌లు, ప్యాడీ క్లీనర్స్, సాంపిల్ గిన్నెలు, సాంపిల్ వీనే పరికరము మొదలగునవి సంబంధిత మార్కెటింగ్ కార్యాలయము నుండి పొందవలెను.
- కొనుగోలు కేంద్రానికి అవసరమగు గోనె సంచులు ముందుగా అంచనా వేసుకొని జిల్లా పౌరసరఫరాల సంస్థ నుండి పొందవలెను.
- ఈవెంట్ సక్రమముగా సమర్ధవంతంగా నడుపుటకు గ్రామములోని రైతు సోదరుల, సంఘ డైరెక్టర్ల సహాయ సహకారాలను తీసుకొనవలెను.
- కొనుగోలు కేంద్రాల పనితీరు, ఏర్పాటుపై రైతు సోదరులకు అవగాహన కల్పించుటకు కరపత్రముల ద్వారా ప్రసార మాధ్యమాల ద్వారా విశేష ప్రచారం కావించాలి.
- రాజకీయ కారణాలు చూపి రైతును వివక్షకు గురికాకుండా చూడాలి.
- రైతులకు కేంద్రము లేదా సెంటర్ వద్ద తగిన సౌకర్యాలు అనగా మంచినీరు, అల్పాహారము అందుబాటులో ఉండునట్లు ఏర్పాటు చేయవచ్చును.

**2. సూచనలు :**

- ఈ సెంటర్ నుండి ధాన్యమును నేరుగా రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేయవలెను.
- ఇందుకుగాను రైతులు తహశీల్దారు / ఆర్.ఐ / గ్రామ కార్యదర్శి జారీ చేసిన పాసు పుస్తకము / సాగు ధృవీకరణ పత్రము వీరి నుండి తీసుకొనవలెను.
- వ్యర్థ పదార్థాలు లేని, తాలులేని, పక్వానికి రాని, మొలకెత్తిన మరియు పురుగు తొలగించిన గింజలులేని తేమశాతం 17%కు మించని ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి రైతులకు రశీదు ఇవ్వాలి.

**ఇబ్బందులు / పరిష్కారాలు**

- నేటి ఆధునిక టెక్నాలజీని ఈ సెంటర్‌నకు అందిపుచ్చుకోవడం
- తద్వారా సెంటర్ నుండి సివిల్ సప్లయ్స్‌వారు గుర్తించిన / కేటాయించిన రైసు మిల్లులకు, లోడ్ వెహికిల్ నెం. : రశీదు మొదలగు వివరములు అప్‌లోడ్.
- రైతులకు ఆన్‌లైన్ ద్వారా 3 రోజుల లోపుగా వారు అమ్మిన ధాన్యానికి సరిపడా సొమ్మును అకౌంటునకు జమచేస్తూ మెసేజ్ తెలుపుట.
- గనీబ్యాగ్స్ కరెక్ట్ సంఖ్యతో అన్ని ఒకే నాణ్యత గలవాటిని అందించుట.
- లోడింగ్ మరియు అన్‌లోడింగ్ సందర్భంలో కార్మికులతో సమస్యలు రాకుండా కార్మిక శాఖను అనుసంధానించుట (అవసమైన సందర్భములో మాత్రమే)
- రైతులు వారి పంటను సెంటరునకు తెచ్చు విషయమై టోకెన్ పద్ధతిని అనుసరించుట ద్వారా తేమశాతం, నాణ్యత తేలిన తరువాత వారి పంటను ఏరోజు ఏ సమయము నిర్ధారణ జరిగి అనవసరమైన చర్చలు, సమయము వృధా కాకుండా ఉండును.
- సంఘాలకు రావలసిన కమీషన్ వెంటనే సివిల్ సప్లయ్స్‌వారు రిలీజ్ చేయుట.
- ఇన్‌కమ్‌టాక్స్ నుండి ఈ ఆదాయము మినహాయింపుకు తగిన చర్యలు చేపట్టుట.
- ప్రభుత్వము ఆయా సంఘ / సెంటర్స్‌కు ప్రత్యేక ఆర్థిక సహాయము గోడౌన్స్ నిర్మాణానికి ఒడ్లు / వరి ఆరబోసుకోవడానికి, ప్లాట్‌ఫారంలు నిర్మించుకొనుటకు ఆర్థిక సహాయం.

## అనంతపురము జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సహకార పరపతి సంఘము లి॥ సర్వ సభ్య సమావేశము

అనంతపురము జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సహకార పరపతి సంఘము యొక్క సర్వసభ్య సమావేశము 25.09.2016 తేదీన సంఘం సొంత కళ్యాణ మండపం రెవెన్యూ కళ్యాణ మండపంలో నిర్వహింపబడినది. ఈ కార్యక్రమమునకు ఆర్.డి.ఓ. శ్రీరామారావు ముఖ్య అతిధిగా విచ్చేశారు. సంఘ కార్యదర్శి వి.రామాంజనేయ రెడ్డి గారు, ఉపాధ్యక్షులు శ్రీ.టి.కుమార స్వామి గారు, కోశాధికారి వెంకటేశ్ గార్లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భముగా ఆర్.డి.ఓ. శ్రీ రామారావు గారు మాట్లాడుతూ సంఘం బాగా పనిచేస్తున్నదని దీనికి కారణం సంఘంనకు సొంత కళ్యాణ మండపం కల్గి ఉండటం ఉదాహరణగా తెలిపారు.

సంఘ కార్యదర్శి శ్రీ రామాంజనేయ రెడ్డిగారు మాట్లాడుతూ సభ్యుల పిల్లల ప్రోత్సహం క్రింద 90% పైగా మార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు నగదు బహుమతిగా రూ. 2000/- రూపాయలు అందిస్తూ, సభ్యుల వాటా ధనముపై 15% డివిడెండు ఇస్తూ లాభాల బాటలో పయనిస్తున్నదని తెలియపరిచారు. సంఘ ఉపాధ్యక్షులు టి.కుమార స్వామిగారు మాట్లాడుతూ సొంతకళ్యాణ మండపంలో వివాహము జరుపకొన్న వారికి 2500/- రాయితీని, ఉపయోగించని సభ్యులకు 2500/- రూపాయలు నగదు అందచేస్తూ సభ్యులకు సేవలు అందింస్తూ లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. సంఘ కోశాధికారి శ్రీ వెంకటేశులుగారు మాట్లాడుతు ప్రస్తుతం సభ్యులకు వ్యక్తిగత ఋణము గరిష్టంగా 1,20,000/-, అత్యవసర ఋణము క్రింద 20,000/- రూపాయలు అందిస్తూ రాబోవు రోజులలో వారి అవసరాల దృష్ట్యా గరిష్ట ఋణం పెంచే సొంతవనరుల ఏర్పాటుకు కృషి చేస్తున్నం అని తెలిపారు. సంఘ డైరెక్టరు శ్రీ కె.శ్రీధర్ గారు, శ్రీ.ఎ.పి.యస్. ప్రసాద్ గారు, శ్రీమతి జ్యోతిగారు, శ్రీమధుసూదన రావుగారు, శ్రీ యస్, నిజాం గారు, శ్రీ పెద్దన్న గార్లు, సర్వీసెస్ అధ్యక్షులు శ్రీ యస్. జయరామప్ప గారు, కార్యదర్శి నీలకంటా రెడ్డి గారు తదితరులు హాజరై ప్రసంగించారు. ఈకార్యక్రమములో సంఘం సభ్యులు విరివిగా పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లాలో నష్టాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక



**కె.వి.రామారావు,** లెక్చరర్
విజయవాడ సహకార శిక్షణా కేంద్రం

ప్రకాశం జిల్లాలో మొత్తం 168 సొసైటీలు పిడిసిసి బ్యాంకు ఆర్థిక సహాయంతో పనిచేస్తున్నాయి. వీటిలో సుమారు 100 వరకు లాభాలబాటలో ఉన్నాయి. సొసైటీలు కేవలం ఋణాల బాట్వాడాకే పరిమితమై ఇతర వ్యాపారాభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో నష్టాలు తప్పడం లేదు. ఏటా కోట్లాది రూపాయల వ్యవసాయ రుణాలు పంపిణీ చేస్తున్న సొసైటీలు నష్టాల్లో ఉండడం గమనార్హం. కొన్ని సంఘాలను ఆర్థిక అవకతవకలు దెబ్బతీస్తున్నాయి. సొసైటీలు పిడిసిసి బ్యాంకుకు చెల్లించాల్సిన దానికంటే ఆయా సొసైటీలకు రైతుల నుంచి రావలసిన మొత్తాలు తక్కువగా ఉండటంతో సొసైటీలు అనివార్యంగా నష్టాల్లో కూరుకు పోతున్నాయి.

**కార్యాచరణ ప్రణాళిక :**

నష్టాల్లో నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను లాభాల బాట పట్టించేందుకు సహకార శాఖ నడుం బిగించింది. వచ్చే మూడేళ్ళలో అమలయ్యే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రారు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రతి మూడు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించి సొసైటీల పని తీరును పరిశీలించి, సమీక్షించి మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో నష్టాల్లో నడుస్తున్న 35 సొసైటీలను గుర్తించి 2016-17 ఆర్థిక సంవత్సరానికి లాభాల బాట పట్టించాలని లక్ష్యం నిర్ణయించినారు. వీటికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని పిడిసిసి బ్యాంకు ఐసిడిపి అధికారులతో సమీక్షించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నది. సొసైటీల పాలకవర్గాలకు సలహా దారులుగా వ్యవహరించేందుకు ప్రతి సొసైటీకి ఒక దత్తత అధికారిని సహకార శాఖ నుండి నియమించారు.

**జిల్లాలో 35 సంఘాల ఎంపిక:**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరములో 35 సంఘాలను లాభాల బాటలో నడిపించాలని లక్ష్యంగా నిర్ణయించారు. వీటిల్లో వాయిదా మీరిన బకాయిలను తప్పని సరిగా వసూలు చేయాలని, సంఘాల వ్యాపారాభివృద్ధికి డిపాజిట్లు సేకరించాలని నిర్ణయించారు. అవి.

| క్రమ. | పిఏసిఎస్ పేరు | చేపట్టవలసిన వ్యాపారాలు |
|---|---|---|
| 1 | దర్శి | సొసైటీ కేంద్రం, వాటర్ ప్లాంట్, కొత్త గోడౌన్, దీర్ఘకాలిక రుణాల పంపిణి |
| 2. | చీమకుర్తి | మీసేవా కేంద్రం, రెడీమేడ్ దుస్తుల షాపు |
| 3. | కొమ్మినేనివారిపాలెం | జనరిక్ మందుల షాపు |
| 4. | పెదచర్లోపల్లి | రూ॥ 10.5 కోట్లకు వ్యవసాయ రుణాల పెంపు, దీర్ఘకాలిక రుణాల పంపిణీ,మీ సేవా కేంద్రం, వాటర్ ప్లాంట్, ఎరువులు, విత్తనాల వ్యాపారం |
| 5. | పెదడోర్నాల | ఎరువుల వ్యాపారం, మీసేవా కేంద్రం |
| 6. | బైస్తవారిపేట | ఎరువుల వ్యాపారం, డిపాజిట్ల సేకరణ |
| 7. | పసుపుగలు | ఎరువుల వ్యాపారం, డిపాజిట్ల సేకరణ |
| 8. | గుర్రపుశాల | ఎరువులు, విత్తనాల వ్యాపారం |
| 9. | పెద్దారవీడు | ఎరువులు, విత్తనాల వ్యాపారం |
| 10. | కూడలవీధివారిపాలెం | ఎరువుల వ్యాపారం |
| 11. | కూకట్లపలి | ఎరువుల వ్యాపారం |
| 12. | పొత్తూరు | ఎరువుల వ్యాపారం |
| 13. | పెదకొత్తపల్లి | ఎరువుల వ్యాపారం |
| 14. | వైదవ | ఎరువుల వ్యాపారం |
| 15. | ఎం.నిడమలూరు | ఎరువుల వ్యాపారం |
| 16. | కండ్లకుంట | ఎరువుల వ్యాపారం |

| | | |
|---|---|---|
| 17. | ఏల్చూరు | ఎరువుల వ్యాపారం |
| 18. | వేలాయపాలెం | ఎరువుల వ్యాపారం |
| 19. | కొండ మంజులూరు | ఎరువుల వ్యాపారం |
| 20. | కోలలపూడి | ఎరువుల వ్యాపారం |
| 21. | ఈదుమూడి | ఎరువుల వ్యాపారం |
| 22. | దేమశ్రీకొండ | ఎరువుల వ్యాపారం |
| 23. | బి. నిడుమలూరు | ఎరువుల వ్యాపారం |
| 24. | దర్శి శ్రీరామ | ఎరువుల వ్యాపారం |
| 25. | చెరుకూరు | ఎరువుల, విత్తనాల వ్యాపారం, మీ సేవా కేంద్రం, ధాన్య సేకరణ |
| 26. | మారెళ్ళ | మీ సేవా కేంద్రం, వాటర్ ప్లాంట్ |
| 27. | చిన్న పావని | ధాన్య సేకరణ, ఎరువులు మరియు విత్తనాల వ్యాపారం |
| 28. | విశ్వనాథపురం | పెట్రోల్ బంక్, ధాన్యసేకరణ, బంగారు నగల హామీపై రుణాలు |
| 29. | నందన వనం | వాటర్ ప్లాంట్, ఎరువుల వ్యాపారం |
| 30. | ఉలవపాడు | వాటర్ ప్లాంట్, మీసేవా కేంద్రం, ఎరువులు మరియు వ్యవసాయ పరికరాలు |
| 31. | మణికేశ్వరం | ఎరువుల వ్యాపారం, సేఫ్ డిపాటిజ్ లాకర్లు |
| 32. | పందిళ్ళపళ్ళి | ఎరువుల వ్యాపారం, ధాన్య సేకరణ కేంద్రం |
| 33. | ఎర్రారెడ్డి | ఎరువుల వ్యాపారం, ధాన్య సేకరణ, వాటర్ ప్లాంట్, మీ సేవా కేంద్రం |
| 34. | చాగల్లు | ఎరువుల వ్యాపారం, ధాన్యసేకరణ, వాటర్ ప్లాంట్ |
| 35. | కారంచేడు | ఎరువుల వ్యాపారం, ధాన్యసేకరణ, శనగల కొనుగోలు |

**సహకార శాఖ రాష్ట్ర అధికారుల సందర్శన:**

ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర సహకార శాఖ అధికార్లు శ్రీ.కె.వీరాచారి స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రారు, శ్రీ.కె.నాగార్జున డిప్యూటీ రిజిస్ట్రార్లు తేదీ. 30.08.2016న పరిగిళ్ళా పల్లి ప్యాక్స్‌ను సందర్శించి, అధ్యక్షులు పాలకవర్గ సభ్యులతో సంఘ అభివృద్ధి గురించి చర్చించి తగు విలువైన సూచనలు జారీ చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి యమ్. శ్రీకాంత్, ఒంగోలు డివిజినల్ సహకార అధికారిణి శ్రీమతి ఇందిర, పిడిసిసి బ్యాంకు డి.ఆర్/ఓయస్‌డి శ్రీ.కె.సీతారామయ్య, సి.టి.సి కడప డి.ఆర్/ ఫ్యాకల్టీ శ్రీ.కె.వి.రామారావు, బ్యాంకు ఎ.జి.యమ్. టి.శ్రీనివాసదేవ్ పిండి, చీరాల యన్.డి.యన్. సి.ఓ. శ్రీ.కె.కోటి వీరయ్య, చీరాల డిసిసిబి బ్యాంకు మేనేజరు ప్రకాష్, సంఘము యొక్క ఆడిటర్లు, సూపర్‌వైజర్లు సంఘ అధ్యక్షులు శ్రీ.కె.యస్. నిరంజన్ బాయి, సిఇఓ.పి.వెంకట స్వామి మరియు పాలకవర్గము సభ్యులు పాల్గొన్నారు.

ఆ తదుపరి శ్రీ.కె.వీరాచారి స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రారు, జిల్లా సహకార శాఖ, మరియు బ్యాంకు అధికారులతో జిల్లా సహకార అధికారి కార్యాలయములో సమీక్ష సమావేశమును నిర్వహించి, అధికారులకు ఈ 35 సంఘాలు ఏ విధంగా అభివృద్ధి బాటలో పయనించాలో వివరిస్తూ తగు దిశా నిర్దేశము చేసి, అధికారులలో ప్రేరణ కల్గిస్తూ విలువైన సూచనలు చేసినారు.

**పిఎసియస్‌ల అభివృద్ధికి చేపట్టవలసిన తగు చర్యలు :**

1. సదరు సంఘానికి కేటాయించబడిన అధికారి పాలకవర్గ సభ్యులతో మాట్లాడి సంఘానికి ఉన్న వనరులు అనగా స్థిర, చర, ఆస్తుల వివరాలు, స్థానిక పరిస్థితులు, స్థానిక వనరులు, అవసరాలను గుర్తించి తగు సూచనలు చేయాలి.
2. ఇప్పటి వరకు సంఘానికి నష్టం రావటానికి కారణాలు తెలుసుకోవాలి.
3. మార్గాలు అన్వేషించాలి.
4. సంఘ పాలకవర్గము మరియు సిబ్బందిలో ప్రేరణ కలిగించాలి.
5. వినియోగ వస్తువులు అమ్మకానికి అవకాశాలు అన్వేషించాలి.
6. సంఘ సభ్యులను (ఎమ్ఇపి) మెంబరు ఎడ్యుకేషన్ ప్రొగ్రామ్ ద్వారా చైతన్య పరచాలి.
7. ధాన్యసేకరణ, ఎరువుల వ్యాపారం, అపరాల కొనుగోలు కేంద్రముల ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలి.
8. డిపాజిట్ల సేకరణ, పొదుపు ఖాతాల నిర్వహణ లాంటివి చేపట్టాలి.

**ముగింపు:**

సహకార సంఘాల కమీషనర్ మరియు రిజిస్ట్రారు వారి ఆదేశాల మేరకు పి.ఎ.సి.యస్‌ల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రాబోవు మూడు సం॥రాల వ్యవధిలో జిల్లాలోని సంఘాలు ఆర్థిక స్వావలంబనతో సొంతంగా నిలదొక్కుకునేలా, వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ లాభాల బాటలో పయనిస్తూ సభ్యుల యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరచి ఒక సుస్థిరమైన సహకార వ్యవస్థ నెలకొంటుంది అని ఆశిస్తూ.

# ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో ముఖ్య కార్య నిర్వాహణాధికారి విధులు - బాధ్యతలు - అధికారాలు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలోని పూర్వపు వేతన కార్యదర్శి (పేయిడ్ సెక్రటరీ) అని పిలువబడే అధికారిని ప్రస్తుతము ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఓ) అని పిలుస్తున్నారు. ఈ ముఖ్య కార్య నిర్వహణాధికారి పాలకవర్గానికి, ఇతర ఉద్యోగులు ముఖ్య కార్యనిర్వహణాధికారికి జవాబు దారీగా ఉండవలెను.

**ముఖ్య కార్యనిర్వహణాధికారి విధులు:**

**(ఏ) చట్టపరమైన విధులు:**

1. సంఘ అధ్యక్షుడి అజమాయిషీకి లోబడి సిఇఓ పనిచేయాలి.
2. సంఘములో జరిగిన ప్రతి వ్యాపార వ్యవహారం అతని ద్వారా జరగాలి.
3. బైలా ప్రకారము (బైలాలో పేర్కొన్నట్లయితే) సంఘం పేరున ఉన్న పత్రాలు దస్తా వేజులు సిఇఓ పేరుతో ఉండాలి.
4. పాలక వర్గం చేసిన తీర్మానములను అమలు పరచవలసిన బాధ్యత సిఇఓకి ఉన్నది.
5. ప్రతీ సభ్యునికి సభ్యత్వం ఇవ్వగానే గుర్తింపు కార్డు ఇవ్వాలి.
6. వాయిదా మీరిన ఋణాలకై సెక్షన్ 71 ప్రకారం లేదా ఇతర సెక్షన్ల క్రింద చట్టపరమైన చర్యలు చేపట్టాలి.
7. ఆడిటర్లు, తనిఖీ అధికార్లు, సహకార శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు అడిగినప్పుడు వెంటనే లెక్కల పుస్తకాలు, జమా ఖర్చుల పట్టికలు, నగదు నిల్వలు, స్టాకు నిల్వలు చూపించాలి.
8. సంఘానికి సంబంధించిన అన్ని ఖాతా పుస్తకాలను సక్రమంగా వ్రాసి ఆడిటు సమయంలో సమర్పించవలెను.
9. వాయిదా మీరిన ఋణగ్రస్తుల పట్టికను తయారు చేసి సంఘములో పరిశీలనార్ధము ఉంచాలి. పాలకవర్గం ద్వారా మహాజన సభ ముందుంచాలి.
10. పాలకవర్గ సభ్యులు తీసుకొన్న ఋణాలు, చెల్లింపులు, సంఘములో చేసిన వ్యాపార వ్యవహారములు పాలకవర్గం ద్వారా మహాజన సభ ముందుచాలి.
11. సభ్యత్వం పొందిన వారి పేర్లు, వివరాలు సభ్యత్వ రిజిష్టరులో పొందుపరచాలి.
12. అనర్హత పొందిన పాలకవర్గం లేదా సాధారణ సభ్యుల వివరాలు పాలక వర్గాల ద్వారా మహాజన సభ ముందుంచాలి.

**(బి) వ్యాపార పరమైన విధులు :**

1. సంఘం తరపున వసూళ్ళయిన డబ్బుకు తగు రశీదు ఇవ్వాలి.
2. సంఘం ఇచ్చే ఋణాలకు సంబంధించిన పత్రాలపై సిఇఓ సంతకం చేయాలి.
3. ఏ రోజు వసూళ్ళయిన నగదు అదే రోజు బ్యాంకులో జమ చేయాలి.
4. ప్రతి నెల జమా ఖర్చు పట్టికలు తయారు చేసి పాలకవర్గం అమోదం పొందాలి.
5. డ్రాయల్ అప్లికేషన్లను తయారు చేసి సకాలంలో ఋణ మంజూరీకి బ్యాంకుకి సమర్పించాలి.
6. క్రెడిట్ లిమిట్స్ స్టేట్‌మెంట్లు సకాలంలో తయారుచేసి సంబంధిత బ్యాంకులో సమర్పించాలి.
7. ఋణాలు మంజూరు కాగానే సభ్యులకు ఋణాలను పంపిణీ చేయాలి.
8. డిపాజిట్ల సేకరణకై ముమ్మరంగా కృషిచేయాలి. సంఘం నిధులను పెంచటానికి ప్రయత్నించాలి.
9. ఋణాల వసూళ్ళకై డిమాండ్ నోటీసులు జారీ చేయాలి.
10. సభ్యులకు సేవ నిమిత్తం నిత్యావసర వస్తువులు, క్రిమిసంహారక మందులు, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, సేంద్రియ, రసాయన ఎరువులు మొదలైనవి అందుబాటులో ఉంచాలి.
11. ఋణాల వసూళ్ళకై జారీ చేయబడ్డ డిక్రీ అమలుకై ఋణగ్రస్తుల ఆస్తులను జప్తు చేయటానికి అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలి.

**(సి) కార్యాలయ నిర్వహణ విధులు :**

1. సంఘము తరుపున రోజువారీ ఉత్తర ప్రత్యుత్తరాల నిర్వహణ
2. బడ్జెట్ కేటాయింపులకు లోబడి పాలకవర్గం నిర్ణయించిన ఖర్చులు మాత్రమే చేయాలి. మించితే మహాజన సభ ఆమోదం పొందాలి.
3. ప్రతిరోజు చిట్టా పుస్తకం వ్రాసి అధ్యక్షుని సంతకం తీసికొని నగదు నిల్వని భద్రపరచాలి.
4. ఆడిట్, తనిఖీలలో ఎత్తి చూపిన లోపాలను సరి చేసి నివేదికను పాలకవర్గానికి సమర్పించాలి.
5. సహకార శాఖ, బ్యాంకు అధికార్లు అడిగిన వెంటనే కోరిన వివరాలు, నివేదికలు, రిటర్నులు సకాలంలో తయారు చేసి అందించాలి.

6. సంఘంలో సభ్యత్వం కోరే వారి దరఖాస్తులు సేకరించి పాలకవర్గం ముందుంచాలి.
7. సభ్యత్వంపై మహాజన సభ తీసుకొన్న నిర్ణయాన్ని నిర్దేశించిన గడువులోగా దరఖాస్తుదారునికి తెలియచేయాలి.
8. పాలకవర్గ సమావేశాలు, మహాజన సభ సమావేశాలకు ఆయా పద్ధతులను బట్టి మీటింగ్ నోటీసులను అజెండాతో సహా పంపించాలి.

**(డి) సాధారణ విధులు :**

1. సంఘ సభ్యులతోను, సాధారణ జనుల తోను స్నేహపూర్వక సంబంధాలు పెంచుకోవాలి.
2. సహకార శాఖ, బ్యాంకు పక్షాన జారీ చేసిన సర్క్యులర్లు, సూచనలు ఎప్పటికప్పుడు తెలుసుకొని, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.
3. తన అజమాయిషీలో పనిచేస్తున్న ఉద్యోగులపై నియంత్రణ చేస్తునే తగుప్రేరణ ఇవ్వాలి.
4. సంఘం ఆస్తులు రక్షించటానికి తగు ఏర్పాట్లు చేయాలి.
5. సహకార సంఘానికి, ఆ గ్రామానికి సంబంధించిన తాజా గణాంక వివరాలు సేకరించి ఉండాలి.
6. సంఘ ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా ఎల్లప్పుడూ సంఘ శ్రేయస్సుకై పాటు పడాలి.

---

## "అనంతపురం డివిజను పోస్టల్ ఉద్యోగుల సహకార పరపతి సంఘము లి॥ స్వర్ణోత్సవ మహాజన సభ

తేది 25.9.2016న అనంతపురం పోస్టల్ ఉద్యోగుల సహకార పరపతి సంఘము స్థాపించి 50 సంవత్సరములు పూర్తి అయిన సందర్భముగా స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి మహాజన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అనంతపురము జిల్లా సహకార అధికారి శ్రీయస్.సూర్యనారాయణ విచ్చేసారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ పరపతి సంఘము తన సభ్యులకు 4 లక్షల రూపాయలు వ్యక్తిగత ఋణములతో పాటు 15% శాతము డివిడెండ్ ఇవ్వడం గర్వించ తగ్గ విషయము అని తెలియచేశారు. ఈ సందర్భముగా సంఘ అధ్యక్షులు శ్రీ.డి.వెంకట స్వామిగారు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం కోసం సభ్యులు మరణిస్తే సంఘము నుంచి వారి నామినీలకు 20,000/- రూపాయలు ఆర్థిక సహాయము అందచేస్తామని, దానితో పాటు సభ్యుల పిల్లల విద్యా ప్రోత్సహకాల క్రింద ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ సంఘ డైరెక్టర్లు రాఘవేంద్ర ప్రసాద్ గారు, యం.జంగమన్న, ఆర్.చంద్రశేఖర్, బి.జయచంద్ర, సి.రంగారెడ్డి, బి.రామాంజనేయులు, యు. వెంటకరమణ, డి.రవీంద్ర, యస్.ఉమ్లానాయక్ గార్లు ప్రసంగాలు చేసారు. ఈ సందర్భముగా సంఘము ప్రగతిని గురించి సభ్యులకు అందిస్తున్న సేవలు సంఘ ప్రగతికి కృషి చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలియపరిచారు.



ఈ స్వర్ణోత్సవ వేడుకలు అనంతపురములోని కనకదాస కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం లెక్చరర్ బి.శ్రీనివాసులు, పాల్గొని సభ్యుల హక్కులు, బాధ్యతలు, సహకార సూత్రాల గురించి తెలియపరిచారు. ఈ స్వర్ణోత్సవ మహాజన సభకు అధిక సంఖ్యలో సభ్యులు హాజరై సంఘ అభివృద్ధికి తగు సూచనలు తెలియ పరిచారు. ఈ సంఘమునకు ఆర్‌టిసి బస్టాండు, రైల్వే స్టేషన్‌కు దగ్గర స్వంత భవనముతో పాటు 8 మంది సిబ్బంది లాభాల బాటలో పనిచేస్తూ, సభ్యుల అవసరాలకు పరపతి మంజూరు చేస్తూ పనిచేస్తున్నది.

# సహకార సంఘాలు - వినియోగదార్ల పరిరక్షణ చట్టం

యస్. సూర్యనారాయణ,
జిల్లా సహకారాధికారి, అనంతనపురం

సహకార సంఘంలో సభ్యుడు కీలకమైన వ్యక్తి. సభ్యుని ఆధారంగానే సంఘ వ్యవహారాలన్నీ నడుస్తాయి. సభ్యుడు సంఘంలో వాటాధనం కలిగిన యజమాని, తనకు కావల్సిన సేవలను పొందే వినియోగదారుడు.

సభ్యుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సహకార సంఘాల బైలాలోను, సహకార చట్టాలు నిబంధనల్లో తగిన ఏర్పాట్లు ఉన్నాయి. సహకార సంఘ సభ్యుడు వినియోగదార్ల పరిరక్షణ చట్టం 1986 ను ఉపయోగించుకొనవచ్చునా అనేది ముఖ్యమైన ప్రశ్న.

ఇటీవల సుప్రీంకోర్టు, వీరేందర్ జైన్ వర్సెస్ అలకానంద సహకార సమూహ గృహ నిర్మాణ సంఘం తదితరులు (2013) 9 సెక్షన్ 383 – కేసులో సహకార సంఘ సభ్యులు వినియోగదారుల పరిరక్షణ చట్టం ఉపయోగించుకోవచ్చునని తీర్పు నిచ్చింది.

ఈ సందర్భంగా వినియోగదారుల పరిరక్షణ చట్టం మరియు సహకార సంఘాల చట్టంలోని అంశాలను పరిశీలించడం అవసరం.

వినియోగదారుల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 2(1)(డి) ప్రకారం పూర్తిగా కాని, పాక్షికంగా కాని డబ్బు చెల్లించి లేదా డబ్బు చెల్లించడానికి హామీ ఇచ్చి లేదా వాయిదాల పద్ధతుల్లో గాని వస్తువులను లేదా సేవలను స్వంత వినియోగానికి కొనుగోలు చేయు వ్యక్తిని వినియోగదారుడు అంటారు. వస్తువులను అద్దెకు తీసుకొను వ్యక్తిని కూడా వినియోగదారుడు అంటారు. స్వంత వినియోగం కాకుండా వ్యాపారం కోసం కొనుగోలు చేసే వారు వినియోగదారులు కారు. వస్తువు నాణ్యతలో గల లోపాలకు, సేవలలో గల లోపాలకు తగిన పరిహారం పొందడానికి వినియోగదారులకు హక్కు ఉంటుంది. గృహ నిర్మాణ సహకార సంఘాల్లోని సభ్యులు కూడా వినియోగదారులుగా సేవా లోపాలపై పరిష్కారం, పరిహారం పొందవచ్చు.

వినియోగదార్లకు ఎలాంటి చిక్కుముడులు, జాప్యాలు లేకుండా సత్వరమే న్యాయం అందించడానికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వినియోగదార్ల న్యాయ స్థానాలు పనిచేస్తున్నాయి.

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం వర్సెస్ విశ్వభారతి గృహ నిర్మాణ సహకార సంఘం తదితరులు – సహకార సంఘాల చట్టం కన్నా వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధివైపు మొగ్గు చూపింది. వినియోగదారుల ఉద్యమాన్ని బలోపేతం చేయడమే వినియోగదారుల పరిరక్షణ చట్టం లక్ష్యం. వినియోగదార్ల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ –3ను పరిశీలిస్తే ఈ విషయం అర్ధం అవుతుంది. ఈ చట్టం క్రింద లభించే పరిష్కారం ఇతర చట్టాల పరిష్కారాలకు విరుద్ధం కాదు. ఇతర చట్టాల అంశాలను తోసి పుచ్చకుండా, వాటి పరిధిని అతిక్రమించకుండా వినియోగదారులకు అదనపు పరిష్కారాలు అందిస్తోంది. ఇతర చట్టాల కింద కూడా పరిష్కారం పొందే వీలున్న విషయాన్ని కోర్టు గ్రహించింది. సంక్లిష్ట అంశాలు, నిపుణులచే సాక్ష్యాల నమోదులాంటి అంశాలుంటే ఫిర్యాదుదారు ఇతర న్యాయస్థానాలను ఆశ్రయించే వీలుంది. ఫిర్యాదుదారుని ప్రయోజనాలను పరిరక్షించడమే అంతిమ లక్ష్యం.

సహకార సంఘాల చట్టం కన్నా వినియోగదారుల పరిరక్షణ చట్టం విస్తృతమైనది. వినియోగదారునికి నిర్ధిష్ట ఉపశమనం కల్పించడమే కాకుండా వారు అనుభవించిన అసౌకర్యానికి తగిన పరిహారం మంజూరు చేసే అవకాశం ఉంది. ఒక వ్యక్తి రెండు చట్టాల కింద కూడా న్యాయం పొందాలని ప్రయత్నిస్తే వినియోగదారుల న్యాయస్థానం కేసులోని వాస్తవాలు, పరిస్థితుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవచ్చును.

సహకార సంఘాల సభ్యులకు ప్రత్యామ్నాయాలున్నంత మాత్రాన రిజిస్ట్రారు పరిధికి వచ్చిన ఇబ్బంది ఏమీలేదు. సభ్యుడు వినియోగదారునిగా పరిగణించబడినప్పుడు, సేవల్లో లోపం కలిగినప్పుడు వినియోగదార్ల పరిరక్షణ చట్టం అమలులోకి వస్తుంది. ఇతర అంశాలు సహకార సంఘాల చట్టం కిందకు వచ్చేవి అన్నీ కూడా రిజిస్ట్రారు పరిధిలోనే ఉంటాయి. వినియోగదార్ల పరిరక్షణ చట్టం వర్తించదు.

మొత్తం మీద చూస్తే సహకార సంఘాల చట్టం పై వినియోగదార్ల పరిరక్షణ చట్టం ప్రభావం పరిమితమే. వినియోగదార్ల పరిరక్షణ చట్టం రిజిస్ట్రారు అధికారాలపై ప్రభావం చూపదు. వివాదాలను పరిష్కరించడం, అప్పీలు స్వీకరించడం లాంటి అంశాలపై ప్రభావం లేదు. సహకార సంఘాల చట్టాన్ని వినియోగదార్ల పరిరక్షణ చట్టాన్ని జాగ్రత్తగా వినియోగించుకుంటే సహకార సంఘాలకు, సభ్యులకు మేలు జరుగుతుంది.

# పొడి దుక్కిలో నేరుగా (ఏరోబిక్) వరిసాగు

సేకరణ:**టి.సోమ్లా,**
డిప్యూటి రిజిస్ట్రార్/ప్రిన్సిపాల్,
సి.టి.సి, విజయవాడ.

వర్షాభావ పరిస్థితులు మెట్టపైర్లనే కాకుండా సంప్రదాయ వరిసాగులో కూడా నష్టం కలిగిస్తుంది. సకాలంలో వర్షాలు లేక, చెరువులు నిండక, కాలువల్లో సాగునీరు చాలా ఆలస్యంగా విడుదల అవ్వడంవల్ల, నారు పెంచి, దమ్ముచేసి వరి పండించే రైతులు ఏటా ఇబ్బందులకు గురై ప్రత్యామ్నాయంగా తక్కువ నీరు ఉపయోగించి దమ్ముచేయకుండా పొడిదుక్కిలో నేరుగా వరి విత్తుకొని సాగుచేసి పండించే విధానాన్ని ఏరోబిక్ వరి అంటారు. ఏరోబిక్ వరిసాగు పద్ధతిలో నీటి వినియోగం తక్కువగా వుంటుంది. కనుక ఈ విధానం నీటి వనరులు తక్కువగా లభ్యమయ్యే ప్రదేశాలకు అనువుగా ఉంటుంది. ఈ పద్ధతిలో పొలాన్ని దమ్ముచేయడం, నారుమడి తయారీ, నాట్లు అవసరం లేకుండానే వరి విత్తనాన్ని నేరుగా విత్తుకొని ఆరుతడి పంటగా సాగుచేయవచ్చు. అడపాదడపా నీరు అందించే సౌకర్యం కలిగిన పరిస్థితులలో ఈ విధానం అనుకూలంగా వుంటుంది. వరి పండించే అనేక దేశాలలో సాగునీటి కొరత, కూలీల కొరత, క్షీణించిన భూసాంద్రత ఇతరకారణాల వలన వరి ఉత్పాదకత తగ్గడం తరచుగా చూస్తున్నాము. నూతన విధానంలో సాగు ఖర్చును తగ్గించి వరిసాగును మరింత లాభదాయకంగా చేయడం అత్యంత అవసరం.

**అనువైన రకాలు:** ఈ ఏరోబిక్ పద్ధతిలో సాగుచేయడానికి లోతైన వేరు వ్యవస్థ కలిగి బెట్టను తట్టుకోగలిగి, తొలిదశలో మంచి పెరుగుదల ఉన్న మధ్యస్థ కాలపరిమితి కలిగిన విజేత, సోనా మసూరి, వసుంధర, పుష్యమి, MT4-1121, స్వల్పకాలిక రకాలైన పుష్కల, ప్రద్యుమ్న, కాటన్‌దొరసన్నాలు, ఎర్రమల్లెలు, సోమశిల రకాలు అనువుగా ఉంటాయి.

**భూమి తయారీ:** తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకొని పలుమార్లు దున్ని, మెత్తని దుక్కి చేసుకున్నట్లయితే కలుపు సమస్యను కొంతవరకు నివారించవచ్చు. సేంద్రియ ఎరువుగాని, కంపోస్టుగాని, పచ్చిరొట్ట అవశేషాన్నిగానీ ఎరువుగా ఆఖరి దుక్కిలోవేసి కలియదన్నాలి. నేల సమతులంగా చదునుగా ఉన్నట్లయితే తేమ సరిగ్గా అంది మొలక సమానంగా వస్తుంది, పంట ఎదుగుదల కూడా సమానంగా ఉంటుంది.

**విత్తే సమయం:** వర్షాలు పడుటకు ముందుగానే పొలాన్ని సిద్ధంచేసి విత్తుకోవాలి లేదా వాతావరణం పొడిగా ఉండి భూమి తడిగా లేనపుడు మాత్రమే నేరుగా విత్తడానికి అనుకూలమైన సమయం. అంటే జూన్ మొదటివారం నుంచి జూలై మూడవవారం లోపల విత్తుకోవాలి. భూమిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు నేరుగా విత్తడం సాధ్యంకాదు

**విత్తన మోతాదు, విత్తే పద్ధతి:** ఎకరానికి 15-20 కిలోల విత్తనం సరిపోతుంది. నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకొని, విత్తే సమయంలో తప్పనిసరిగా పొడి విత్తనాన్ని శుద్ధిచేసుకోవడం వల్ల అనేక రకాల తెగుళ్ళను అదుపుచేయవచ్చు. తద్వారా మొలక శాతం పెరిగి, మొక్కల సాంద్రత అనుకున్నట్లుగా ఉండి దిగుబడిలో వృద్ధి ఉంటుంది. కార్బండిజమ్ మందుతో కిలో విత్తనానికి 3 గ్రా చొప్పున కలిపి విత్తనశుద్ధిచేసి తక్కువలోతులో విత్తుకోవాలి. శుద్ధి చేసిన విత్తనాన్ని నేరుగా చదును చేసిన పొలంలో వెదజల్లడం ద్వారా గాని, ట్రాక్టర్‌తో నడిచే గొర్రుతోగాని, సీడ్‌డ్రిల్ సాయంతోగాని విత్తినపుడు విత్తనంతోపాటు ఎరువును కూడా వేసుకునే సౌలభ్యం ఉంటుంది.

**నీటి యాజమాన్యం:** పైరు మొదటి దశలో అనగా 30-40 రోజుల వరకు అడపాదడపా కురిసే వర్షాలకు పెరుగుతుంది. చెరువులు లేదా కాలువల్లో నీటి లభ్యతను బట్టి 30 రోజుల తర్వాత పొలంలో నీరు పారించి మాగాణి వరిగా మార్చుకోవాలి. ఇదే సమయంలో ఒత్తుగా ఉన్న మొక్కలను పీకి చేను పలుచగా ఉన్నచోట నాటుకోవాలి.

**కలుపు యాజమాన్యం:** ఏరోబిక్ వరిసాగులో నీరు నిల్వ ఉండకపోవడం వలన కలుపు సమస్య ఎక్కువగా వుంటుంది. పొలంలో ఉన్న తేమతో కలుపు మొక్కలు పోటీపడి పంట దిగుబడిని తగ్గిస్తాయి. సమగ్ర కలుపు నివారణ చర్యలు గైకొనకపోయినట్లయితే ఏరోబిక్ వరిసాగులో కలుపు వల్ల 50-90 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. విత్తనాలు విత్తిన పిదప భూమిలో తగు మాత్రం తేమ ఉండే పరిస్థితులలో వ్యవసాయాధికారి గారి సూచనల మేరకు కలుపు నివారణ మందులు వాడాలి. అయితే అన్ని రకాల కలుపు మొక్కలు ఉన్నప్పుడు 30 రోజుల తర్వాత మనుషులతో కలుపుతీసుకోవడం వల్ల భూమి గుల్లబారి ఎక్కువ తేమ భూమిలో నిలువ ఉండి, తద్వారా పంట త్వరగా బెట్టుకి రాకుండా చూడవచ్చు.

సిఫారసు మేరకు కలుపు మందులు వాడుతూ వరుసల మధ్య అంతరకృషి చేయడం ద్వారా వేర్లకు ఆక్సిజన్ (ఆమ్లజని) బాగా అంది వేరు వ్యవస్థ దృడంగా ఉండి పంట ఆరోగ్యంగా పెరుగుతుంది.

**ఎరువుల యాజమాన్యం:** ప్రధాన పోషకాలను సిఫారసు మేరకు వేయాలి. సిఫారసు చేసిన భాస్వరం ఎరువు పూర్తి మోతాదును ఆఖరి దుక్కిలో, పొటాష్ ఎరువును సగభాగం ఆఖరి దుక్కిలో, మిగిలిన సగభాగం నత్రజని ఎరువుతోపాటు అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. ఏరోబిక్ వరిలో ఇనుపదాతు లోపం, జింకులోపం వల్ల వచ్చే నష్టాలను అధిగమించడానికి స్థానిక వ్యవసాయాధికారి యొక్క సలహా మేరకు మందులను పిచికారి చేయాలి.


**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

1. విత్తనం విత్తడానికి 10-15 రోజుల ముందు తేలికపాటి నీటి తడి ఇవ్వడం ద్వారా మొలకెత్తిన కలుపును దున్నివేయడం వలన 25-30 శాతం కలుపును ముందుగానే నివారించవచ్చు.
2. మొక్కలను రెండు ఆకుల దశలో తప్పనిసరిగా పలుచన చేయాలి.
3. సమయానుకూలముగా కలుపు నివారణ చేయాలి.
4. ఇనుము, జింకు పోషకాల లోపాలు అధికంగా ఉంటాయి. కాబట్టి లోపాన్ని గుర్తించిన వెంటనే తగిన చర్యలు చేపట్టాలి.
5. పంట తొలి దశలో దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితులు సంభవించినట్లయితే పంట దెబ్బతినే అవకాశాముంటుంది. కాబట్టి అవసరం మేరకు తేలికపాటి నీటి తడులు మాత్రమే ఇవ్వాలి.
6. చౌడు భూముల్లో మొలకశాతం తగ్గుతుంది. బెట్టను తట్టుకోలేదు.
7. కలుపు మందు వాడేటపుడు నేలల్లో సరైన తేమ ఉండాలి. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు కలుపు నివారణ మందులు వాడాలి.

**ఈ వరిసాగు వల్ల ప్రయోజనాలు:**

1. నారు పోసుకోవడం, నాటు వేసుకోవలసిన అవసరం ఉండదు.
2. సమయానుకూలంగా విత్తుకోవచ్చు. ఆలస్యంగా ముదురునారు వేసుకొనే సమస్య ఉండదు.
3. కూలీల సమస్య, నీటి సమస్య, ఆలస్యంగా నాట్లు వేయడం అనే సమస్యలుండవు.
4. చీడపీడల సమస్య తక్కువగా ఉంటుంది.
5. విత్తన మోతాదు 30 శాతం ఆదా అవుతుంది. సాగు ఖర్చు తగ్గి అధిక ఆదాయం పొందే అవకాశముంటుంది.
6. మీథేన్ వాయువు విషప్రభావాన్ని తగ్గించవచ్చు.
7. సాధారణ మాగాణి, వరిసాగు పంటకంటే 7-10 రోజుల ముందుగానే కోతకు వస్తుంది. అందువల్ల రెండవ పంటగా వేసుకొనే అపరాలుకాని, మొక్కజొన్న వంటి పైర్లను సరైన సమయంలో విత్తుకోవచ్చు.

# అమృతలూరు గ్రామీణ సహకార పరపతి సంఘం



**వి. వెంకట లక్ష్మీనారాయణ**
అధ్యక్షులు,
అమృతలూరు గ్రామీణ సహకార పరపతి సంఘం

గుంటూరు జిల్లాలో అమృతలూరు, గోవాడ, ముల్పూరు, పంచల వరం గ్రామాల వ్యవహారిక విస్తీర్ణంతో 1956 లో సహకార సంఘంల చట్టం క్రింద రిజిష్టరు కాబడి అమృతలూరు ముఖ్య కేంద్రంగా పనిచేస్తూ గ్రామీణ రైతులకు పరపతి మరియు పరపతేతర సేవలందిస్తూ రైతుల మన్ననలను పొందుతున్న సహకార సంఘమే "అమృతలూరు సహకార గ్రామీణ పరపతి సంఘం.

**సంఘం అందించుచున్న సేవలు:**

రైతులకు అవసరమగు విత్తనములు సరఫరా
ఎరువుల సరఫరా
కిసాన్ కార్డుల ద్వారా స్వల్ప కాలిక ఋణాల పంపిణీ
సభ్యులకు దీర్ఘకాలిక ఋణాల పంపిణీ
నిత్యావసర సరుకుల పంపిణీ
బంగారు ఆభరణాల తాకట్టుపై ఋణాలు కల్పించడం.
రైతులు ఉత్పత్తి చేస్తున్న ధాన్యం ను సేకరించుట.
రైతులు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులను నిలువ చేసుకొనుటకు గోదాములు.
సభ్యులలో పొదుపు ప్రవృత్తిని పెంపొందిచడం వంటి సేవలు నిరంతరం అందించుచూ చాలా సహకార సంఘాలకు ఆదర్శంగా నిలుస్తూ సభ్యులకు ఉత్తమమైన సేవలు అందించడమే గాక గత 6 సంవత్సరములుగా లాభాలను ఆర్జించుచున్నది.

**సంఘ భవిష్యత్తు ప్రణాళికలు (కార్యక్రమములు)**

సంఘ ఆధ్వర్యంలో మెడికల్ షాపును నిర్వహించాలనే ఉద్దేశంను రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రివర్యుల అనుమతి కొరకై ప్రతిపాదనలు పంపడము జరిగినది.

సాంప్రదాయ పద్దతులతో ఉత్పత్తి అగుచున్న విద్యుత్ శక్తి సరఫరా

మన అవసరాలకు సరిపోనందున మనం విద్యుత్‌ను యితర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకొంటున్న సంగతి మన అందరికి తెలిసిన విషయమే. సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పాదనలో ఒకటయిన సౌర శక్తి ద్వారా విద్యుత్ ఉత్పాదన చేయవలెననే ఆసక్తితో ఎ.పి.రెన్యువబుల్ ఎనర్జి డవలప్‌మెంట్ కార్పోరేషన్ యొక్క అనుమతి పొంది 5 కెడబ్లూపి గ్రిడ్ కనెక్టడ్ పవర్ ప్లాంటు (సౌరశక్తి)ను సంఘం నెలకొల్పుచున్నది. ఈ ప్లాంటు ద్వారా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ఎపిట్రాన్స్‌కో కు విక్రయించి సంఘంనకు అదనం ఆదాయ కల్పించుట ముఖ్యోద్దేశం.

నాబార్డు వారి ఆర్థిక సహకారంతో సంఘ ప్రాంగణంలో ఇ-ఫ్రెష్ కేంద్రంను ఏర్పాటు చేసి భూసార పరీక్ష, పంటల విశ్లేషణ, బయోఫెర్టిలైజర్ వాడకము వంటి సౌకర్యము లను రైతులకు కల్పించుట మరియు కంప్యూటర్ శిక్షణ వంటి అవగాహనా కార్యక్రమములు నిర్వహించుట.

ఈ-సేవా కేంద్రం నెలకొల్పి సభ్యులకు వివిధ రకములైన సేవలు అందించుట.

2015-2016 సంవత్సరములో సంఘ రైతుల ఉత్పత్తులను కుదవ పెట్టుకొని 153.99 లక్షల రూపాయల ఋణాలను మంజూరు చేయడం జరిగినది. దీని వలన రైతులు వడ్డీ వ్యాపారస్తుల చేతుల్లో చిక్కుకోకుండా ఉండడం మరియు రైతులకు గిట్టుబాటు ధర వున్నప్పుడే వారి ఉత్పత్తులను అమ్మి లాభాలను ఆర్జించుటకు రైతులకు అవకాశము కలిగినది.

సంఘం కల్పించు చున్న సేవల వలన సంఘ విస్తీర్ణంలో గల రైతులు సంఘం పట్ల ఆకర్షితులైనందువలన సంఘ సభ్యుల సంఖ్య పెరుగుటయే గాక, సంఘ వ్యాపారము, సంఘం సేకరించిన డిపాజిట్లలో పెరుగుదల, అలాగే సంఘం ఆర్జించు చున్న లాభాలలో పెరుగుదల ఈ దిగువ పట్టికలు పరిశీలించితే మనకు అవగతమగుచున్నది.

**సభ్యత్వ వివరములు :**

| సం॥ | మెంబర్ షిప్ | షేర్ క్యాపిటల్(లక్షల్లో) |
|---|---|---|
| 2010-2011 | 1364 | 31.81 |
| 2011-2012 | 1364 | 54.40 |
| 2012-2013 | 1716 | 65.30 |
| 2013-2014 | 1857 | 87.80 |
| 2014-2015 | 1853 | 81.26 |
| 2015-2016 | 1574 | 79.89 |

**ఆర్థిక స్థితి వివరములు : (లక్షల్లో)**

| సం॥ | మంజూరు చేసిన ఋణాలు | షేర్ క్యాపిటల్ |
|---|---|---|
| 2010-2011 | 528.51 | 533.47 |
| 2011-2012 | 902.29 | 666.48 |
| 2012-2013 | 1842.22 | 1742.61 |
| 2013-2014 | 1953.10 | 1793.81 |
| 2014-2015 | 857.85 | 901.80 |
| 2015-2016 | 1591.92 | 1614.01 |

**సంఘంలో గల డిపోజిట్ల వివరములు : (రూ॥ లక్షల్లో)**

| సం॥ | డిపాజిట్లు | శాతం (పెరుగుదల) |
|---|---|---|
| 2010-2011 | 17.54 | -- |
| 2011-2012 | 19.46 | 10% |
| 2012-2013 | 32.58 | 67% |
| 2013-2014 | 71.61 | 119% |
| 2014-2015 | 141.30 | 97% |
| 2015-2016 | 105.36 | -- |

**సంఘ లాభముల వివరములు :**

| సం॥ | లాభము రూ॥ లక్షలలో |
|---|---|
| 2010-2011 | 3.6 |
| 2011-2012 | 6.56 |
| 2012-2013 | 7.06 |
| 2013-2014 | 7.59 |
| 2014-2015 | 11.52 |
| 2015-2016 | 18.59 |

**పరపతేతర వ్యాపారము ద్వార ఆర్జించిన లాభముల వివరములు :**

| సం॥ | అమ్మకాలు లక్షలలో | ఆర్జించిన లాభము |
|---|---|---|
| 2010-2011 | 122.90 | 1,87,231.65 |
| 2011-2012 | 114.33 | 3,05,225.43 |
| 2012-2013 | 136.51 | 7,56,758.43 |
| 2013-2014 | 161.25 | 2,98,062.94 |
| 2014-2015 | 141.84 | 3,89,209.05 |
| 2015-2016 | 204.59 | 1,80,534.43 |

పుబ్బలో పుట్టి మఖలో మరణించు కీటకాలవలె అనేక సహకార సంఘాలు స్థాపించబడి అనతికాలములోనే మూతపడి రద్దగుచున్న సహకార సంఘాలున్న ఈ కాలంలో సహకార సంఘం ద్వారా సభ్యులకు మేలైనటువంటి పరపతి మరియు పరపతేతర సేవలు అందించుచున్న "అమృతలూరు గ్రామీణ సహకార పరపతి సంఘం"ను ఆదర్శంగా చేసుకొని అన్ని సహకార సంఘాలు పనిచేసి సంఘ సభ్యులకు మేలైన సేవలు అందిస్తాయని గాంధీజీ గారు కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనలో భాగస్వాములు కావాలని కోరుకుందాం.

# బుచ్చిరెడ్డి పాలెం గ్రామీణ బ్యాంకుతో సహకార మధురిమలు

రామాల అంజిరెడ్డి,
డిఆర్ / ఫ్యాకల్టీ, సిటిసి, కడప




విద్యాలయాలకు, వైద్యాలయాలకు భూరి విరాళాలిచ్చిన ఎందరో వదాన్యులకు పుట్టినిల్లు, నిబద్ధత కలిగిన రాజకీయ వేత్తలకు కవులకు కళాకారులకు కాణాచి అయిన గ్రామం బుచ్చిరెడ్డిపాలెం. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నందలి జిల్లా కేంద్రమునకు కేవలం 15 కిమీ. దూరంలో నెల్లూరు -ముంబాయి జాతీయ రహదారి నందుగల మండల కేంద్రమిది. స్వాతంత్ర్య సమర యోధునిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, మంత్రిగా ఎన్నో ఉన్నత పదవులు నిబద్ధతతో నిర్వహించి, రాజకీయాలలో విలువలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిన వారు, స్వతహాగా కవి, కవిపోషకులు అయిన డా॥ బెజవాడ గోపాలరెడ్డి: "కృషీవలుడు లాంటి ఖండ కావ్యముల రచయిత, కవికోకిల బిరుదాంకితులైన స్వర్గీయ దువ్వూరి రామిరెడ్డి: దాదాపు రెండు దశాబ్దాలకు పైగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మకుటంలేని మహారాణి"గా వెలుగొందిన కళాభినేత్ర వాణిశ్రీ లాంటి మహా మహులకు పుట్టినిల్లు ఇది. ఈ గ్రామానికి దక్షిణ భాగంలో పవిత్ర పినాకినీ తీరం. ఆ తీరమునందు "జొన్నవాడ"లో వెలసిన శ్రీ కామాక్షి దేవి సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయం, పశ్చిమోత్తర భాగంలో పుడమి తల్లిని పులకింప జేస్తూ నెల్లూరు రాజనాలను ముక్కారు పంటలుగా పండించేటందుకు కారణమైన కనిగిరి రిజర్వాయర్ ఈ గ్రామానికి శ్రీరామరక్ష.

సుమారుగా నలభై వేలకు పైగా జనాభా కల్గిన ఈ గ్రామంలో ఎందరో సహకార వేత్తలు, సహకార వ్యవస్థపై చక్కని అవగాహన కలిగినవారు అధికంగా కలరు అనడంలో అతిశయోక్తిలేదు. ఈ గ్రామంలో ఒక్కొక్కటి సాలీనా కోటి రూపాయలకు పైగా నికరాదాయము ఆర్జిస్తూ వేల సంఖ్యలో సభ్యులకు పరపతి, పరపతేతర సేవలు అందిస్తున్న "వవ్వేరు సహకార గ్రామీణ బ్యాంకు" మరియు "బుచ్చి రెడ్డి పాలెం సహకార గ్రామీణ బ్యాంకు" ఒకే గ్రామములో సమాంతరంగా ఆరోగ్యకరమైన వాతావరంలో పనిచేస్తూ ఉండడమే దీనికి నిదర్శనం. ఇదే గ్రామంలో "గృహనిర్మాణ సహకార సంఘము" కూడా స్థాపించబడి సభ్యులకు నూతన గృహాల నిర్మాణానికి, గృహాల కొనుగోలుకు "రాష్ట్ర గృహ నిర్మాణ సహకార సంస్థ" ద్వారా ఋణాలను అందిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నది. ఈ జిల్లాలో ఆరోగ్యకరమైన వాతావరణంలో పనిచేస్తున్న ఏకైక గృహ నిర్మాణ సహకార సంఘమిది.

కీ.శే॥ శ్రీ మేనకూరు బలరామి రెడ్డి గారి నిరంతర కృషితో బుచ్చిరెడ్డి పాలెం గ్రామమునందు క్రీ.శ.1957 వ సం॥లో "ది.బుచ్చిరెడ్డి పాలెం కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంకు లి॥ స్థాపించబడి ఇంతింతై వటుడింతై అన్నట్లు దిన దినాభివృద్ధి చెందుతూ ఎందరో సభ్యులకు, సభ్యేతరులకు కూడా నిరంతరం సేవలు అందిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నది. తేది. 31.03.2016 నాటికి సదరు సహకార గ్రామీణ బ్యాంకు వివరములు దిగువన పేర్కొనబడినది.

01. సంఘము పేరు మరియు రి.నెం. : "ది బుచ్చిరెడ్డి పాలెం కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ లి., నెం. కె.69 బుచ్చిరెడ్డి పాలెం -- నెల్లూరు జిల్లా.

02. రిజిష్టరు గావించబడిన తేది : 02.09.1957

03. పని ప్రారంభించబడిన తేది : 06.09.1957

04. వ్యవస్థాపక అధ్యక్షులు : కీ. శే॥ మేనకూరు బలరామిరెడ్డి గారు.

05. వ్యవహారిక రెవిన్యూ గ్రామాలు : 1. బుచ్చిరెడ్డి పాలెం 2. ఇసుక పాలెం 3. రేబాల 4. నాగమాంబ పురం 5. జొన్నవాడ 6. శ్రీరంగ రాజపురం 7. రెడ్డి పాలెం.

06. ఆర్థిక సహాయము చేయు బ్యాంకు : "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" నెల్లూరు టౌన్ బ్రాంచ్.

07. మొత్తము సభ్యుల సంఖ్య : 2719

08. సభ్యుల షేరుధనము : రూ. 99,79,655.00

09. డిపాజిట్లు వివరములు :

ఎ) ఫిక్స్‌డ్ డిపాజిట్లు : రూ. 36,72,24,749.00

బి) సేవింగ్స్‌డిపాజిట్లు : రూ. 1,77,01,702.00

సి) డైలి డిపాజిట్లు : రూ. 1,0940,209.00

డి) త్రిఫ్టు డిపాజిట్లు : రూ. 22,09,936.00

ఇ) లాకర్ కొరకు డిపాజిట్లు : రూ. 43,17,824.00

ఎఫ్) సెక్యూరిటీ కొరకు డిపాజిట్లు

సిబ్బంది చేసినవి రూ : 80,000.00

డైలీ డిపాజిట్ ఏజెంట్లు చేసినవి రూ. 3,28,000.00

గోల్డ్ అప్రైజరు చేసినవి రూ. 30,000.00

మొత్తము డిపాజిట్లు + షేరుధనం రూ. 41,28,12075.00

10. ఇతర బ్యాంకుల నందు సంఘము డిపాజిట్లు :

ఎ) స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నెల్లూరు టౌన్ బ్రాంచ్ రూ. 8,79,43,137.00

బి) ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ – బుచ్చిరెడ్డి పాలెం రూ. 4,63,50,031.00

సి) ఆంధ్రాబ్యాంక్ బుచ్చిరెడ్డి పాలెం – రూ. 4,16,00,000.00

డి) ఎపిజిబి: ఎకెనగర్ నెల్లూరు రూ. 25,60,000

ఇ) ఎపిజిబి , మూలాపేట – నెల్లూరు రూ. 93,60,000

ఎఫ్) ఎపిజిబి: ఇందుకూరు పేట రూ. 10,00,000.00

డిపాజిట్ల మొత్తము : రూ. 18,88,13,168.00

11. ఇతర సంస్థలలో గల షేర్ల వివరములు :

ఎ) నెల్లూరుజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు రూ. 96750.00

బి) నెల్లూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ రూ. 500.00

సి) నెల్లూరు జిల్లా మార్కెటింగ్ స్టోర్సు రూ. 50.00

డి) ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కంపెనీ రూ. 40,00,000

ఇ) క్రిషక్ భారతీ ఫెర్టిలైజర్ కం., రూ. 10,20,000.00

మొత్తము షేరు ధనము రూ. 51,17,300.00

12. సంఘంచే ఇవ్వబడిన ఋణములు :

ఎ) వ్యవసాయ ఋణములు : స్వల్పకాలిక రూ. 2,28,50,631.00

బి) వ్యవసాయ ఋణములు : మధ్యకాలిక రూ. నిల్

సి) వ్యవసాయ ఋణములు : దీర్ఘకాలిక రూ. 4,70,46,957.00

డి) ఫిక్స్‌డ్ డిపాజిట్స్ ఋణములు రూ. 2,41,79,077.00

ఇ) క్యాష్ క్రెడిట్ లోన్లు 84,35454.00

ఎఫ్) గోల్డు లోన్లు రూ. 140023827.00

జి) పోస్టల్ బాండ్లపై లోన్లు రూ. 6,18,093.00

హెచ్) డే డిపాజిట్ లోన్లు రూ. 34,60,600.00

మొత్తము ఋణములు రూ. 24,66,14,639.00

13. సంఘమునకు గల ఆస్తుల వివరములు : బుచ్చిరెడ్డి పాలెం గ్రామంలో సుమారు 120 అంకణాల స్థలం ఉండగా, అందులో 50 అంకణాలలో విశాలమైన కార్యాలయ భవనం కలదు. ఇందులో స్ట్రాంగ్ రూం, లాకర్స్ సదుపాయములు కలవు. 3 కి.మీ దూరంలోని రేబాల గ్రామము నందు 40 అంకణాల ఖాళీ స్థలంలో నిర్మించబడిన 250 మెట్రిక్ టన్నుల గోడౌను కలదు. బుచ్చి రెడ్డి పాలెం గ్రామంనందు మరొక 37 అంకణాల ఖాళీ స్థలము, అందు రేకుల షెడ్డు నిర్మాణము కలదు. ఇది సంఘమునకు ఇ.పి. సెటాఫ్ ద్వారా లభించినది.

సదరు బ్యాంకు ప్రారంభం నుంచి అధ్యక్షులుగా పనిచేసిన వారి వివరములు దిగువన పేర్కొనబడినవి. మేనకూరు బలరామి రెడ్డి గారు (1957–61), మేనకూరు శ్రీనివాసులు రెడ్డి గారు (1961 – 70 । 1992 –2005), బెజవాడ వెంకట కృష్ణా రెడ్డి గారు (1970–71), కలికి కృష్ణా రెడ్డి గారు (197–76), బెజవాడ సుందర రామిరెడ్డి గారు (1976–81), మేనకూరు బాలకృష్ణా రెడ్డి గారు (1981–87), ఏనుగు ఇంద్ర సేనారెడ్డి గారు (1987–92) శ్రీ మేనకూరు రాధా కృష్ణా రెడ్డి గారు (2005–10):, బెల్లం కొండ లక్ష్మయ్య గారు (2010–13), యేటూరు శివరామ కృష్ణా రెడ్డి గారు (2013).

తేది. 31-01-2013న జరిగిన ఎన్నికలలో బ్యాంకు పాలక వర్గములో శ్రీ యేటూరు శివరామ కృష్ణా రెడ్డి గారు అధ్యక్షులుగా, శ్రీతన్నీరు నరసింహారావు గారు ఉపాధ్యక్షులుగా, శ్రీ రామిశెట్టి మోహన్ బాబుగారు, శ్రీ బెల్లం కొండ లక్ష్మయ్య గారు, శ్రీ మిట్ట దొడ్ల చిన్న పెంచలయ్య గారు, శ్రీమూగా శ్రీనివాసులు గారు, శ్రీ బత్తుల హరి క్రిష్ణగారు, శ్రీమతి కోడూరు ప్రసన్న గారు, శ్రీ గంగపట్నం మధు సూదన రెడ్డి గారు, శ్రీమతి మానికల వెంకట రమణమ్మ గారు, శ్రీమతి జ్యోతి రామమ్మగారు, శ్రీ భీమతాటి శేఖర్ గారు, శ్రీ పత్తి రామిరెడ్డి గారు పాలకవర్గ సభ్యులుగా ఎన్నిక

కాబడినారు.

ఈ గ్రామీణ బ్యాంకు నందు ప్రస్తుతము శ్రీ కలికి సురేష్ కుమార్ రెడ్డిగారు ముఖ్య కార్య నిర్వాహణాధికారిగాను, శ్రీ పూల మహేష్ కుమార్, శ్రీ కిలారి పెంచల అశోక్ కుమార్, శ్రీమతి పత్రి వసంతమ్మ, శ్రీమతి కందుకూరి రమ గారలు గుమాస్తాలుగాను, శ్రీమతి పృధ్వి దేవసేనమ్మ, శ్రీమతి పాశం రమణమ్మ గారలు సహాయకులుగాను, శ్రీ సూరం వేంకటేశ్వర్లు వాచ్‌మెన్ గాను పనిచేయుచూ సేవలు అందించుచున్నారు.

సదరు బుచ్చిరెడ్డి పాలెం గ్రామమునందు ఇతర వాణిజ్య బ్యాంకులైన ఆంధ్రాబ్యాంక్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ శాఖలు పనిచేయుచున్నప్పటికీ పోటీని తట్టుకొని పై వాటికన్నా మిన్నగా సభ్యులకు సేవలు అందించుచూ ప్రతి సంవత్సరం లాభాల బాటలో పయనించుచున్నది. గడచిన గత 5 సంవత్సరాలలో బ్యాంకు వరుసగా 2011-12 సంii నందు రూ. 49,00,326-00లు: 2012-13 సంii నందు రూ. 54,36,372-00లు: 2013-14 సంii నందు రూ. 62,58,442-00లు: 2014-15 సంii నందు రూ. 77,15,905-00, 2015-16 సంii నందు రూ. 86,20,120-00 నికర లాభములను ఆర్జించి ఆరోగ్యకరమైన వాతావరణంలో అభివృద్ధి చెందుతూ యున్నది.

బ్యాంక్ వారు తమ సభ్యులకు అందిస్తున్న వివిధ రకములైన సేవలు దిగువన తెలిపిన విధంగా కలవు.

1. స్వల్పకాలిక, మధ్యకాలిక, మరియు దీర్ఘకాలిక ఋణములను సభ్యులకు సకాలంలో తమ స్వంత నిధుల నుంచి అందించుట.
2. బంగారు ఆభరణముల మీద ఋణములను అందించుట
3. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద ఋణములు అందించుట.
4. సభ్యులకు అవసరమైన లాకర్ సదుపాయము కల్పించుట
5. సభ్యులకు అవసరమైన బ్యాంకింగ్ సేవలు
6. నాణ్యమైన ఎరువులు, విత్తనములు, ప్రభుత్వము వారు నిర్ణయించిన ఎమ్.ఆర్.పి.రేట్లకే రైతులకు విక్రయించుట.
7. ప్రతి సంవత్సరం బ్యాంకు ఆర్జించిన లాభములపై సభ్యులకు డివిడెండ్లు పంపిణీ.
8. బ్యాంకు నందలి క్రియాశీలక సభ్యులకు ప్రతి సంవత్సరం మహాజన సభ అనుమతి మేరకు వ్యవసాయ పనిముట్లు ఉచితంగా పంపిణీ.
9. వివిధ రకములైన ఎరువుల కంపెనీల నుంచి నిపుణులను, వ్యవసాయ రంగంలోని నిష్ణాతులను పిలిపించి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పనిముట్ల వినియోగం, ఎరువుల సక్రమ వాడకం లాంటి అంశములపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయుట.
10. ప్రభుత్వము నుంచి అందే వడ్డీ రాయితీలు, మరియు ఇతర ప్రోత్సాహకాలు సభ్యులకు సక్రమంగా అందించుట.

**సహకార రంగంలో బ్యాంకు విజయానికి గల కారణాలు :**

01. పేద, ధనిక తారతమ్యము లేకుండా ఉద్యోగులు సభ్యులందరికీ అందుబాటులో వుండి సేవలు అందచేయుట.
02. సరియైన రీతిలో ఉద్యోగుల సమయపాలన, క్రమ శిక్షణ
03. సకాలంలో ఋణముల పంపిణీ, సీజన్ వారీగా ఎరువులు, విత్తనాలు అందరికీ అందుబాటులో వుంచుట.
04. దినసరి పాలనా వ్యవహారాలలో పాలకవర్గము వారు జోక్యము చేసుకొనక పోవుట.
05. ముందస్తుగా వార్షిక ప్రణాళిక తయారు చేసుకొని దాని లక్ష్యముల సాధనకు కృషి చేయుట.
06. ఉద్దేశ్య పూర్వకంగా బకాయిలు చెల్లించని డిఫాల్టర్లపై లీగల్ చర్యలు తీసుకొనుటలో ఉద్యోగులు, పాలక వర్గము వారు సమన్వయంతో పనిచేయుట.

బ్యాంకు అభివృద్ధికి కృషి చేసి పదవీ విరమణ చేసిన ముఖ్య కార్య నిర్వహణాధికారి శ్రీ వల్లూరు శ్రీనివాసులు రెడ్డి గారిని గురించి ముచ్చటించక తప్పదు. వీరు 1983 వ సంiiలో బ్యాంకు నందు ఉద్యోగిగా చేరి 2015 సంii నందు పదవీ విరమణ గావించునంత వరకూ సుమారుగా 32 సంiiలు ఎటువంటి రిమార్కులు లేకుండా సేవలు అందించారు. వీరు సభ్యులకు ఋణముల పంపిణీ విషయంలో ఎంత సులభతరంగా వ్యవహరిస్తారో, వసూళ్ళ విషయంలో అంతే కఠినంగా వ్యవహరిస్తారని ప్రతీతి. కృషితో నాస్తి దుర్భిక్షమ్" అనే నానుడిని నిజంచేసి చూపిన నిత్య కృషీవలుడు శ్రీ వల్లూరి.

# ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘము





**శ్రీ కె. రామమూర్తి రెడ్డి**
డిప్యూటి రిజిష్ట్రారు/ ప్రిన్సిపాల్
సహకార శిక్షణా కేంద్రము, కడప

కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణము లోని పేద, మధ్య తరగతి ప్రజల గృహ నిర్మాణ అవసరాల నిమిత్తము 1948 సంవత్సరము నందు అప్పటి మద్రాసు సహకార సంఘముల చట్టం, 1932 మేరకు ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘము ఏర్పాటు గావించబడినది. అప్పటి నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ మధ్య మరియు పేద తరగతి ప్రజల సొంత ఇంటి కలలను సాకారము చేస్తున్నది.

ఈ సంఘమునకు మొదటి అధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది అయినటువంటి శ్రీ పి.నరసింహారెడ్డి గారు పనిచేసారు. ఈయన తదనంతరము శ్రీ కొప్పురపు సుబ్బారావు గారు ప్రముఖ వ్యాపార వేత్త అధ్యక్షులుగా పనిచేసారు. శ్రీ ఆకుమళ్ళ పద్మనాభ శాస్త్రిగారు, శ్రీ పాణ్యం యర్రముని రెడ్డి గారు, శ్రీ. వై.వి.సుబ్బారెడ్డి గారు, శ్రీ ఆనం మల్లికార్జున రెడ్డి గారు, శ్రీ గాదంశెట్టి చెంచయ్య గారు, శ్రీ. కామిశెట్టి సుబ్రహ్మణ్యం గారు ఈ సంఘానికి అధ్యక్షులుగా వ్యవహరించినారు. ప్రస్తుతం శ్రీ.బసిరెడ్డి శంకర్ రెడ్డి గారి అధ్యక్షతన ఈ సంఘము తన కార్యకలాపాలను నిర్వహించుచున్నది. ఈ సంఘము ప్రొద్దుటూరు పట్టణమునకే తల మానికమైన మూడు అద్భుతమైన కాలనీలను రూపొందించినది.

**1. పాణ్యం యర్రముని రెడ్డి కో-ఆపరేటివ్ కాలని :**

1968-1970 సంవత్సరాల మధ్య కాలములో సంఘ అధ్యక్షులుగా పనిచేసినటువంటి శ్రీ పాణ్యం యర్రముని రెడ్డి గారి పేరిట ప్రభుత్వము నుండి 27 ఎకరాల భూమిని సేకరించి ప్రొద్దుటూరు పట్టణానికే తలమానికమైనటువంటి అద్భుతమైన కాలనీని రూపొందించడం జరిగినది. ప్రస్తుతము ప్రొద్దుటూరు పట్టణములో ఇదే అత్యంత విలువైన ప్రాంతము. విశాలమైన రోడ్లు గల ఈ కాలని వై.యం.ఆర్.కాలనిగా ప్రసిద్ధి చెందినది. ఈ కాలనీ నందు విశాలమైన పార్కు, గ్రంథాలయము, దేవాలయములు కలిగి అత్యంత రమణీయంగా ఉంటుంది.

**2. శాస్త్రినగర్ కాలని :**

1953-1968 సంవత్సరాల మధ్యకాలములో సంఘ అధ్యక్షులుగా పనిచేసినటువంటి ప్రముఖ న్యాయవాది శ్రీ ఆకుమళ్ళ పద్మనాభ శాస్త్రిగారి పేరిట 8.00 ఎకరాల భూమిని సేకరించి 75 ప్లాట్లతో శాస్త్రి నగర్ అనే కాలనిని రూపొందించడం జరిగినది. ఈ కాలనీ నందు విశాలమైన రోడ్లు కలిగి ఉంది. రోడ్లకిరువైపుల పచ్చదనముతో విశాలమైన పార్కులతో అత్యంత రమణీయంగా విరాజిల్లుతున్నది. ఈ కాలని నందు అద్భుతమైన శ్రీ రాజ రాజేశ్వరి దేవాలయము కలదు. ప్రతి సంవత్సరము ఈ దేవాలయము నందు దసరా నవరాత్రి ఉత్సవములు అత్యంత రమణీయంగా నిర్వహిస్తున్నారు.

**3. కందుల బాలనాగిరెడ్డి కాలని :**

ప్రొద్దుటూరు పట్టణము నందు మైదుకూరుకు వెళ్ళే రహదారి పక్కన దాదాపు 35.00 ఎకరములలో దాదాపు 465 ప్లాట్లతో ఒక అద్భుతమైన కాలనిని రూపొందించడం జరిగినది. ఈ కాలని మూడవ కాలనిగా ప్రసిద్ధి చెందినది.

ప్రొద్దుటూరు సహకార గృహ నిర్మాణ సంఘము పట్టణమునందు అద్భుతమైన కాలనీలను రూపొందించడమే కాకుండా పట్టణ ప్రజలకు గృహ నిర్మాణ అవసర నిమిత్తమై రూ. 2.00 లక్షల నుండి రూ. 5.00 లక్షల వరకు ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంఘాల ఫెడరేషన్ వారి ఆర్థిక సహాయంతో ఋణాలు మంజూరు చేయుచున్నది. ఈ సంఘము నుండి ఇప్పటికి దాదాపు 5000 నుండి 6000 మంది సభ్యులు ఋణాలు పొంది వారి సొంత ఇంటి కలలను నిజం చేసుకొన్నారు. ప్రస్తుతము ఈ సంఘము వారి యొక్క సొంత నిధుల నుండి కూడా సభ్యులకు ఋణాలు మంజూరు చేస్తూ లాభాల బాటలో పని చేస్తూ, ఆర్జించిన లాభాలలో సంఘ సభ్యులకు డివిడెండు రూపేణా లాభాలలో వాటా ప్రకటిస్తున్నది.

# పేదలకు భీమా - చంద్రన్న భీమా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పేద, మధ్య తరగతి ప్రజల కోసం చంద్రన్న భీమా పేరిట నూతన పథకాన్ని అక్టోబరు 2, 2016న తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ఆవిష్కరించారు.

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పేదలకు భీమా సౌకర్యం కల్పించి ఆదుకోవడానికి ఈ పథకాన్ని తీసుకొచ్చారు. సుమారు 2 కోట్ల మంది ప్రజలకు చంద్రన్న భీమా ద్వారా కుటుంబానికి తక్షణమే తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటారు. ఈ పథకాన్ని ఎలా పొందాలో తెలుసుకుందాం.

**రూ. 15 చెల్లిస్తే చాలు**

ఈ భీమా పథకం కింద నమోదు అయ్యే వారు రూ. 15 చెల్లిస్తే చాలు. ఆ మొత్తం కూడా నమోదు బృందాలుగా పనిచేస్తున్న డ్వాక్రా సంఘాల ఖర్చు కోసమే. ఈ పథకం కోసం భీమా ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఒక్కొక్కరికి రూ. 134.50 చొప్పున మొత్తం రూ. 269 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భీమా సంస్థలకు చెల్లించనుంది. నమోదయ్యే కార్మికులకు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా ఉండాలి. ఈ రెండు లేకున్నా వాటి కోసం అప్పటికప్పుడు దరఖాస్తు చేసి... ఆ దరఖాస్తు రశీదును చూపించినా చాలు. నమోదు చేసుకున్న వారికి అక్కడికక్కడే చంద్రన్న భీమా ధృవీకరణ పత్రాలను అందజేస్తారు.

**30 రోజులలో భీమా సొమ్ము :**

ఈ పథకం కింద ఉన్న కార్మికుడు ఏదైనా ప్రమాదానికిలోనై భీమా పరిధిలోకి వస్తే అతని కుటుంబానికి నెల రోజుల్లో సాయం అందుతుంది. పాలసీదారుడు మరణించిన కేసుల్లో తక్షణ సాయంగా రూ. 5 వేలు గ్రామ మహిళా సమాఖ్యలు అందిస్తాయి. భీమా కంపెనీ మూడువారాల్లో క్లయిం పరిష్కరిస్తుంది. 30 రోజుల్లో పాలసీదారు కుటుంబానికి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. పరిహారం కోసం.... భీమా పాలసీ పత్రం, పంచాయతీ కార్యదర్శితో మరణధృవీకరణ పత్రం, ప్రమాదంలో మరణిస్తే ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం పత్రాలు, నామినీ పేరుమీద బ్యాంకు ఖాతా పాస్‌బుక్ ప్రతి, పిల్లలు చదువుకుంటుంటే వారి స్టడీ సర్టిఫికెట్స్ ఇవ్వాలి.

**అర్హులెవరు ?**

ఈ పథకం కింద నమోదయ్యేందుకు 18 నుంచి 70 ఏళ్ళ వయసు కలిగి.. నెలకు రూ. 15 వేలకంటే తక్కువ ఆదాయం ఉన్న అసంఘటిత కార్మికులంతా అర్హులే. అసంఘటిత కార్మికులంటే... భవన నిర్మాణ రంగంలో పనిచేసే తాపి మేస్త్రీలు, సెంట్రింగ్ పనివారు, రంగులు వేసేవారు, ప్లంబర్లు, వడ్రంగులు, ఎలక్ట్రికల్ పనివారు ఇలా ప్రతి ఒక్కరూ.

- ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో కనీసం 50 రోజులు పనిచేసినవారు.
- వ్యవసాయ కూలీలు, నర్సరీల్లో పనిచేసేవారు, అటవీ ఉత్పత్తుల పనివారు, పాడి పరిశ్రమ.. మత్స్య పరిశ్రమల్లో పనిచేసేవారు.
- చేనేత, కుమ్మరి, కమ్మరి, క్షురకులు, చర్మకారులు, రజకులు, స్వర్ణకారులు.
- స్వయం ఉపాది పనివారు... అంటే వీధి వ్యాపారస్తులు, తోపుడు బండ్లవారు, మెకానిక్‌లు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు.
- ఆటో, టాక్సీ, లారీ, బస్సు, ట్రాక్టర్, బుల్డోజర్, రోడ్ రోలర్ డ్రైవర్లు, క్లీనర్‌లు, సహాయకులు.
- సినిమా హాళ్ళు, హొటళ్లు, షాపింగ్ కాంప్లెక్సులు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ళలో పనిచేసేవారు, ప్రవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లలో పనిచేసేవారు.
- ప్రయివేటు సంస్థలలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పనివారు, వర్కింగ్ జర్నలిస్టు చట్టం కిందకురాని పత్రికా, టీవి విలేకరులు, కెమెరామెన్‌లు.
- ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యావలంటీర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్యమిత్ర, భీమా మిత్ర, 108,104 సిబ్బంది, సెర్ఫ్, మెప్మాలో పనిచేస్తున్న సిబ్బంది, డేటా ఎంట్రీ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది అర్హులే.
- వీరే కాకుండా ఇళ్ళలో పనిచేసేవారు, కొరియర్ బాయ్‌లు.. ఇలా 15 వేల లోపు ఆదాయమున్న పనివారంతా అర్హులే.

**5 లక్షల వరకు సాయం :**

చంద్రన్న భీమా కింద నమోదై ఈ పథకం పరిధిలో ఉన్నవారికి సాయం మొత్తం ఇలా ఉంటుంది.

ప్రమాద మరణం / పూర్తి అంగవైకల్యం : రూ. 5,00,000

పాక్షిక, శాశ్వత అంగవైకల్యం : రూ. 3,62,500

సహజ మరణం : రూ. 30,000

కుటుంబంలో 9,10వ తరగతి

ఇంటర్, ఐటిఐ. చదివే వారుంటే ఉపకార వేతం : 1200

**కె.రామమూర్తి రెడ్డి,** ప్రిన్సిపాల్
సహకార శిక్షణా కేంద్రము, కడప.

# భారతదేశంలో ఉచిత న్యాయ సేవ సౌకర్యం

న్యాయసహాయం పొందటమనేది ప్రతి ఒక్కరికీ ఒక ప్రధానమైన ప్రాథమిక అవసరమే కాదు, హక్కు కూడా! ఈ ఒక్క హక్కు లేకపోతే ఎన్నో మానవ హక్కులకు మనుగడ ఉండదు.

అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల నివేదికలోని అధికరణం 14(3)(d) ప్రకారం "తనని ప్రత్యక్షంగా విచారించే హక్కు అవసరమైతే తన వాదన వినిపించేందుకు స్వయంగా గానీ, ఎవరైన అర్హులైన న్యాయవాదులను నియమించుకొని, వారి ద్వారా వినిపించుకునే హక్కు, వివరాలు తెలుసుకునే హక్కు, తనకు న్యాయపరమైన మద్దతులేని ఎడల తగిన సహాయాన్ని పొందేహక్కు, అది కూడా తాను ఖర్చు భరించలేని పేదరికంలో ఉన్నట్లయితే, మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరించి, పూర్తి ఉచితంగా సహాయాన్ని అందించడం" ప్రధానమని వివరిస్తున్నది. ఈ అధికరణం ప్రతి వ్యక్తి యొక్క కనీస హక్కును తెలియచేస్తున్నది. మరో విధంగా చెప్పాలంటే, న్యాయ సేవ అనేది సమానత్వపు హక్కులో అవిచ్ఛిన్న భాగం. అయితే ఇంతవరకు ఈ న్యాయ సహాయ హక్కును కేవలం క్రిమినల్ కేసులలోనే వినియోగిస్తున్నారు. మన భారత రాజ్యాంగం అయితే న్యాయ హక్కును ప్రత్యేకంగా అందించలేదు కానీ, ఆదేశిక సూత్రాలలోని అధికరణం 39-ఏ అశక్తులైన ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయాన్ని అందించాలని పేర్కొంటున్నది. రాజ్యాంగంలోని 39-ఏ అధికరణం ఏమి చెబుతుందంటే " న్యాయాన్ని పరిరక్షించే విధంగా ఉండాలి, న్యాయాన్ని ఉచితంగా ఇవ్వగలగాలి. ఏవిధంగానైనా న్యాయాన్ని పొందే హక్కును ఎవరూ కూడా ఏ కారణం చేతనూ కోల్పోకూడదు."

రాజ్యాంగంలోని అధికరణం 21 ప్రజలకు ప్రసాదించిన వ్యక్తి స్వేచ్ఛలో భాగంగానే న్యాయ సహాయం అందరికీ అందాలి. ఎం.హెచ్. హస్కోట్ వెర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ కేసులో జస్టిస్ కృష్ణ అయ్యర్ తీర్పునిస్తూ, " ఒక నేరస్తుడు జైల్లో ఉన్నట్టయితే, అతను రాజ్యాంగం తనకు ప్రసాదించిన న్యాయాన్ని పొందేహక్కును, అవకాశాన్ని కోల్పోతాడు. అలాంటి సమయాల్లో అధికరణం 14, 21, 39-ఏ లను కలిపి చదువుతూ, తగిన న్యాయ సహాయాన్ని అందజేయాలి " అని చెప్పారు.

ఖత్రి వెర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ అనే మరో కేసులో సుప్రీంకోర్టు స్వచ్ఛమైన న్యాయ విధానంలో న్యాయ సహాయం అనేది ఒక అనివార్యమైన విధానమే కాక, అధికరణం 21లో ఒక అంతర్భాగం కూడ అని వ్యాఖ్యానించింది. పేదలకు వనరుల కొరతను కారణంగా చూపి,లేదా పాలనాపరమైన కారణాలను చూపి ఉచిత న్యాయాన్ని ఏరాష్ట్రమూ ఇవ్వకుండా ఉండరాదు. రాజ్యాంగ పరంగా అది దాని బాధ్యత. పేదలెవరికైనా సరే, వారు చెల్లించలేని స్థితిలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం తప్పక ఉచితన్యాయ సహాయం అందించి తీరాలి. షీలా వెర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇలాంటి ఉచిత న్యాయ సహాయం అధికరణం 14,21,39-ఏ లలో స్వతస్సిద్ధంగా నిబిడీకృతమై ఉన్నదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో జస్టిస్ భగవతి తీర్పునిస్తూ, " న్యాయవాదులు తప్పనిసరిగా సమాజంలోని అట్టడుగు వర్గాల వారిని చేరి, వారికి న్యాయం ఉచితంగా అందేలా చూడాలనీ, రాజ్యాంగంలోని ఈ సౌకర్యం సరైన వారిని చేరేటట్లు చూడాలని " అన్నారు. ముఖ్యంగా అరెస్టు అయినపుడు లేదా ఇలాంటి ఏదైనా సమస్యలో చిక్కుకున్నపుడు వారికి ఏమిచేయాలో తోచదు. ఎవరి వద్దకు వెళ్ళాలో కూడా తెలియదు. ఇటువంటి సందర్భములో వారిని ఆదుకోనట్లయితే అది న్యాయదేవతకే మచ్చ అని కూడా అయన అన్నారు. మరో కేసు సుఖ్ దాస్ వెర్సెస్ అరుణాచల్ ప్రదేశ్‌లో సుప్రీం కోర్టు మరో అడుగు ముందుకేసి, రాష్ట్రాల ఈ రాజ్యాంగ బాధ్యతను గుర్తు చేస్తూ విషయానికి ఒక సకారాత్మక ముగింపు నిచ్చింది. ఎవరైనా వ్యక్తి ఆర్థిక నేరాలకు పాల్పడితే లేదా వ్యభిచారము వంటి అత్యంత హేయమైన నేరానికి పాల్పడితే ఈ ఉచిత న్యాయాన్ని అందించరాదన్న వాదనను ఖండిస్తూ, నేరం నిరూపితమయ్యేవకూ ప్రతివారూ అమాయకులేననే నానుడిని గుర్తుచేస్తూ, మతిస్థిమితం లేని, లేదా సరైన మానసిక స్థితి లేని ఎవరైనా నేరానికి పాల్పడితే, వారికి ఈ ఉచిత న్యాయహక్కు ఉంటుందని వ్యాఖ్యానించింది. కనుక, రాజ్యాంగంలోని అధికరణం 21 ప్రకారం న్యాయ సహాయము వేగవంతమైన విచారణ మానవ హక్కులలో భాగమేనని తేలింది.

**న్యాయ సేవ సహాయ చట్టం :**

ఆర్టికల్ 39-ఏ ననుసరించి, న్యాయ సేవ ప్రాధికార చట్టం 1987 రూపుదాల్చింది. న్యాయ సహాయానికి చట్టబద్ధత కల్పించే ఉద్దేశ్యంతో దేశ వ్యాప్తంగా ఈ చట్టాన్ని నవంబర్ 09, 1995 నుండి అమలులోకి తెచ్చారు. తరువాతి నెలలోనే అనగా డిసెంబర్ 5 తేదిన జాతీయ న్యాయ సహాయ సేవ ప్రాధికరణ సంస్థ (National Legal Services Authority, NALSA) ఉ

నికిలోనికి వచ్చింది. ప్రజలకు అందించే న్యాయ సహాయ విధానం ఎలా ఉండాలనేది ఈ NALSA నిర్ధారిస్తుంది. జాతీయ, రాష్ట్రాల, జిల్లా మరియు తాలూకా స్థాయిలలో తమ కార్యాలయాలను నెలకొల్పి ఈ NALSA పేదలకు భారం లేకుండా సమర్థవంతమైన న్యాయ సహాయాన్ని అందచేస్తుంది. ఈ చట్టం సెక్షన్ 3(2)(a) ప్రకారం జాతీయ స్థాయిలో ఈ సంస్థకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి Patron in chief గానూ, ఒక పదవిలోనున్న లేదా పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఈ NALSA పనిచేస్తుంది. ఇక రాష్ట్రస్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోను, జిల్లా స్థాయిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోను పనిచేస్తాయి. ఇక తాలూకా స్థాయిలో ఒక తాలుకాకు గానీ, లేదా కొన్ని తాలూకాలు కలిపిగాని స్థానిక సివిల్ జడ్జి నేతృత్వంలో ఈ సంస్థ పనిచేస్తుంది. దీని సేవలను ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్ళే ఉద్దేశ్యంతో లోక్ అదాలత్ వంటి మేళాలను నిర్వహిస్తుంది. న్యాయస్థానాలలో న్యాయ సహాయాన్ని ఉచితంగా అందించడంతోపాటు, ఈ NALSA సాధారణ ప్రజల కోసం న్యాయమేళాలను, లోక్ అదాలత్‌లను, ప్రత్యామ్నాయ పరిష్కార వేదికలను నిర్వహిస్తుంది. నిరక్షరాస్యత, అజ్ఞానంతో కునారిల్లుతున్న పేదలందరినీ చేర్చడం ఈ సంస్థ ముందున్న అతిపెద్ద సవాలు.

పేదలకు ఉచిత న్యాయాన్ని అందజేసే విధానానికి శాశ్వతత్వాన్ని ఇచ్చే ఈ చట్టం అన్ని జాతీయ, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల ప్రశంసలనూ పొందింది. రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందిన ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ఇలాంటి సంస్థలు హామీనిస్తున్నాయి. దీని స్ఫూర్తితో ఐక్యరాజ్యసమితి వారు 2012 వ సంవత్సరంలో " నేర న్యాయ పరిరక్షణ " విధానంలో న్యాయసహాయానికి ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ప్రజలందరికీ సమాన న్యాయం అందాలంటే ఇలాంటి చర్యలే సరైనవి.

# ప్రకాశం జిల్లా ప్యాక్స్‌ల సిఇఓలు సహకార సంఘాల పనితీరుపై అధ్యయన నివేదిక

సహకార సంఘాల పనితీరుపై జిల్లాలోని పిఎసిఎస్ సిఇఓలు మరియు బ్యాంకు సిబ్బంది ది. 25.8.2016 నుండి 30.08.2016 వరకు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని వివిధ సంఘాలను సందర్శించి వాటి పనితీరుపై సమీక్ష జరిపారు.

సభ్యుల చైతన్యము, గ్రామాలలో పాడి, పంట మరియు అక్షరాస్యతతో నిండిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని సహకార సంఘాలు ఆశించిన స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిపి సంఘ సభ్యులకు మంచి సేవలందిస్తున్నాయి అనుటలో అతిశయోక్తి లేదు.

వాటి పనితీరు పరిశీలించిన పాలకవర్గం సంఘాలను ముందుకు తీసుకొని వెళ్ళు విషయంలో సభ్యులకు సేవలందించే విషయంలో చొరవ, మొదలగు విషయాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయటం కోసం ఆయా సంఘాలను స్వయంగా ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు గౌ॥శ్రీ ఈదర్ మోహన్ బాబుగారి నాయకత్వంలో, జిల్లా సహకార బ్యాంకు ఐసిడిపి ఆధ్వర్యంలో సిపిఓ మరియు డిప్యూటి రిజిష్ట్రారు / ఓ.యస్.డి, 40 సంఘాల సిఇఓలు సదరు జిల్లాలలోని సంఘాలను సందర్శించినారు.

**1. టి.నర్సాపురం పిఎసిఎస్, పశ్చిమ గోదావరి జిల్లా :**

గ్రామీణ ఆర్థిక ప్రగతికి వ్యవసాయం తలమానికం. సహకార రంగం ద్వారా ఇటు ప్రజలకు అటు సభ్యులకు ఇతోధిక సేవలందిస్తుంది. టి.నర్సాపురం పి.ఎ.సి.ఎస్ ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక అప్పులతో పాటు కాసా డిపాజిట్లు, బంగారు ఆభరణాలపై అప్పులు, రికరింగ్ డిపాజిట్స్ మరియు సభ్యులకు లాకర్ల సదుపాయం కల్పిస్తుంది. మొత్తం గ్రామ జనాభాలో అనగా 2500 కుటుంబాలలో 4500 మంది సంఘ సభ్యులుగా నమోదు అయి ఉన్నారు. సభ్యులకు ఈ క్రింది పేర్కొన్న సౌకర్యాలను అందుబాటులోనికి తెచ్చింది. 2014–2015 సంవత్సరపు వివరాలు.

- ఎరువుల అమ్మకం ద్వారా 2014–15 సంవత్సానికి 1.30 కోట్లు వ్యాపారం చేసి రూ. 3.64 లక్షల లాభాన్ని ఆర్జించింది.
- పురుగుల మందుల ద్వారా 21.24 లక్షలు వ్యాపారం చేసి రూ. 29,708/– ల లాభాన్ని ఆర్జించింది.
- పెట్రోలు బంకు ద్వారా నాణ్యమైన పెట్రోలును వినియోగదారులకు సరఫరా చేస్తూ రూ. 9.21 కోట్లు వ్యాపారం చేసి రూ. 8.86 లక్షలు లాభాన్ని ఆర్జించింది.
- లూబ్రికెంట్స్ ద్వారా లాభాన్ని పెంచుతుంది.
- నాణ్యమైన విత్తనాల ద్వారా రూ. 66,777/– లాభాన్ని గడించింది.

– రైస్ & క్యాటిల్ ఫీడ్ వ్యాపారాలు, పాల వ్యాపారము ద్వారా రూ. 5.73 లక్షల లాభాన్ని ఆర్జించింది.

– వే(బ్రిడ్జ్ నిర్వహణ ద్వారా రూ. 4.76 లక్షల లాభాన్ని, గోదాముల నిర్వహణ ద్వారా రూ. 1.92 లక్షలు, ధాన్యం కొనుగోలు ద్వారా ఆదాయాన్ని పెంచుతుంది.

– మనకు అత్యంత అవసరమైన నీటిని ఆర్ఓ వాటర్ ప్లాంటు నిర్వహణ ద్వారా రూ. 31,893/- లు సంపాదించి ఈ రంగాన్ని విస్తరణ చేయుటకు కొత్త ప్లాంటును బాటిల్ మినరల్ వాటర్ రంగంలోకి ప్రవేశించింది. ఎన్.సి.డి.సి సహకారాన్ని కోరుచూ ప్రతిపాదనలు పంపియున్నారు.

2014-15 సంవత్సరంలో అన్ని రంగాలు కలుపుకొని రూ. 5.12 లక్షల లాభాన్ని ఆర్జించినప్పటికి 2015-16 నాటికి రూ. 20.00 లక్షల లాభం రావచ్చని సంఘ సి.ఇ.ఓ. శ్రీ టి.కిషోర్ కుమార్ గారు తెలిపియున్నారు.

**2. ఆ తరువాత మండపేట మండలం ద్వారకపూడిలో ఉన్న జెడ్.మేకపాడు సంఘాన్ని** ది. 29.07.2016న సందర్శించగా సంఘ అభివృద్ధిని పాలకవర్గ సభ్యులు స్వయంగా హాజరై వివరించారు. సంఘ అధ్యక్షులు శ్రీ లక్ష్మీ వీర భద్రరావు సంఘ వివరాలను తెలియజేసి ఉన్నారు. సంఘము పరపతి వ్యాపారంతో పాటు పరపతేతర వ్యాపారం నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. సంఘం ద్వారా సభ్యులకు అనగా 1194 మంది సభ్యులకు ఈ క్రింది సేవలు అందిస్తున్నది.

పరపతి వ్యాపారము : రూ. 7.74 కోట్లు

పరపతేతర వ్యాపారం రూ. 1.15 కోట్లు

లాభము - రూ. 14.60 లక్షలు.

నూటికి నూరుశాతం రికవరీ ద్వారా ఆడిట్‌లో మంచి సంఘంగా "ఎ" క్లాసిఫికేషన్ జారీ చేసి ఉన్నారు.

**3. ఆ తదుపరి పిఏసిఎస్ వెల్లగుర్ల మండలం, విజయనగరం జిల్లాలోని కెల్లా సంఘాన్ని సందర్శించి ఉన్నాము.**

ఈ సంఘము కూడా పరపతి మరియు పరపతేతర వ్యాపారం నిర్వహిస్తున్నది.

– పరపతి వ్యాపారము రూ. 3.82 కోట్లు వ్యాపారం నిర్వహిస్తున్నది.

– గోల్డు లోన్లు, గోదాముల నిర్వహణ ద్వారా రూ. 41.89 లక్షల వ్యాపారం చేస్తున్నది.

– సభ్యుల నుండి సంఘం రూ. 50.02 లక్షలు డిపాజిట్స్‌ను సేకరించినది.

– ఇతర వ్యాపారం ద్వారా అనగా మొక్కజొన్న కొనుగోలు ద్వారా రూ. 3.29 లక్షలు, ధాన్యం కొనుగోలు ద్వారా రూ. 4.15 లక్షలు 2014-15 సంవత్సరానికి ఆదాయాన్ని ఆర్జించినది.

సంఘ పనితీరుకు గాను కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 38.97 లక్షలు మరియు రూ. 16.85 లక్షలు సంఘానికి అదనపు నిధులు రాబట్టుకొన్నది.

**4. శ్రీకాకుళం జిల్లాలోని అరసవెల్లి పిఏసిఎస్ ను కూడా సందర్శించి దాని అభివృద్ధిని స్వయంగా తెలుసుకొన్నాము.**

– సభ్యులకు దీర్ఘకాలిక / స్వల్పకాలిక ఋణాలు రూ. 10.00 కోట్ల వరకు మంజూరు చేసియున్నారు.

– సభ్యుల నుండి రూ. 1.36 లక్షలు డిపాజిట్స్ సేకరించియున్నారు.

– ఐసిడిపి ద్వారా పరపతేతర వ్యాపారానికి, పరపతి వ్యాపారానికి షేరు క్యాపిటల్ తీసుకొని సంఘ అభివృద్ధికి తోడ్పడుతున్నది.

పై సంఘ వ్యాపార లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలిస్తే సంఘాల పరపతి మరియు పరపతేతర వ్యాపార లావాదేవీలను సహకార రంగం ద్వారా ప్రజలకు అందిస్తూ మంచి స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి అనుటలో అతిశయోక్తి లేదు. ఇదే స్ఫూర్తి మన జిల్లాలో సంఘాలు కొనసాగిస్తే ఇటు రైతులకు, జిల్లాలకు మంచి గుర్తింపు లభించగలదని ఆశించవచ్చు.

## సహకార విధానం

పుట్టుకతోనే మానవుడు సంఘ జీవి. పరస్పర సహకారంతోనే మానవులు తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాల్సి ఉంటుంది. ఒక వ్యక్తిగా చేయలేని పనిని ఒక సమూహంగా చేయవచ్చును. వ్యక్తుల మధ్య సహజంగా ఉన్న సహకార భావానికి కొన్ని నియమాలు, సూత్రాలు, విలువలు, పద్ధతులను ఏర్పాటు చేసి సహకార విధానంగా రూపొందించడమైనది. వ్యవసాయ రంగంలోని సన్న, చిన్నకారు రైతుల మరియు వ్యవసాయేతర రంగంలోని బడుగు, బలహీనవర్గాలకు చెందిన పేద ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరుచుటయే సహకార విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ ఉద్దేశ్యాల సాధనకై సహకార సంఘాల చట్టాలను రూపొందించి అమలులోనికి తేవడమైనది. ఈ చట్టాల క్రింద ఏర్పడిన సహకార సంఘాల పనితీరును సులభతరం చేయుటకు మరియు సంఘాలను బలోపేతం చేయుటకు మన రాష్ట్రం కూడా కాలానుగుణంగా సహకార సంఘాల చట్టాలకు సవరణలు తెస్తూ సమగ్రమైన చట్టాలను ఆచరణలోకి తెచ్చింది.

# సహకార సంస్థల యందు స్థిరాస్తులపై తరుగుదల



శ్రీ నారు సత్యనారాయణ రెడ్డి,
అసిస్టెంట్ రిజిస్ట్రార్/ లెక్చరర్
విజయవాడ సహకార శిక్షణ కేంద్రం

సహకార సంస్థలయొక్క ఆడిట్ యొక్క ముఖ్య ఉద్యేశము ఒక కాలపరిమితికి నిజమైన ఆర్థిక ఫలితాలను తెలియపరుచుట మరియు ఒక తేది నాటికి నిజమైన మరియు వాస్తవమైన ఆర్థిక పరిస్థితిని తెలియజేయడం. ఈ ఉద్యేశము సఫలము కావాలంటే అన్ని స్థిరాస్తులమీద తరుగుదలను ఏర్పాటుచేయవలెను. స్థిరాస్తుల విలువ ఎల్లప్పుడు ఒకే విధముగా ఉండదు. ఆస్తి నాణ్యతలో గాని, విలువలో గాని సంభవించే తగ్గుదలను తరుగుదల అందురు. ఈ తరుగుదల అనేది ఆస్తులను ఉపయోగించడం, భౌతిక శక్తుల ప్రభావము, శాస్త్ర,సాంకేతిక రంగాలలో వచ్చే మార్పులు మొదలగు కారణాల వలన ఏర్పడవచ్చును.

స్థిరాస్తుల మీద తరుగుదలను వివిధ పద్ధతుల ద్వారా లెక్కించెదరు. అయితే వాటిలో స్థిర వాయిదాల పద్ధతి మరియు తగ్గుచున్న నిల్వల పద్ధతి ముఖ్యమైనవి. సహకార సంస్థల యందు తరుగుదలను ఏ పద్ధతి ద్వారా ఏర్పాటు చేయాలి మరియు ఏ రేట్ల ప్రకారము తరుగుదలను ఏర్పాటుచేయాలనే విషయములమీద సంబంధించి స్పష్టమైన ఆదేశములు లేవు. సాధారణముగా ఏపద్ధతిలో మరియు ఏ రేట్ల ప్రకారము గత సంవత్సరము తరుగుదలను ఏర్పాటుచేసినారో అదేవిధముగా ప్రస్తుత సంవత్సరము స్థిరాస్తుల మీద తరుగుదలను ఏర్పాటుచేసెదరు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించి CAS Manual నందు ఇంతకు ముందు ఏపద్ధతి ప్రకారము తరుగుదలను ఏర్పాటుచేయుచున్నారో అదే పద్ధతిని పాటించవలసినదిగా తెలిపియున్నారు. దానికనుగుణముగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో స్థిరాస్తుల మీద తగ్గుచున్న నిల్వల పద్ధతి (Diminishing Value or Written Down Value Method) పద్ధతి ప్రకారము తరుగుదలను లెక్కించుచున్నారు. అదేవిధముగా ఏరేట్ల ప్రకారము అయితే గత సంవత్సరము తరుగుదలను ఏర్పాటుచేసినారో అదేవిధముగా ప్రస్తుత సంవత్సరములో కూడా తరుగుదలను లెక్కించుచున్నారు. నాబార్డు వారి Audit Manual అనుగుణముగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఇన్‌కమ్ టాక్స్ చట్టములో పేర్కొనబడిన రేట్ల ప్రకారము మరియు తగ్గుచున్న నిల్వల పద్ధతి ప్రకారము తరుగుదలను ఏర్పాటు చేయుటకు నిర్ణయించడమైనది. అయితే ఇందుకు సంబంధించి ఛీఫ్ ఆడిటరు దగ్గర నుండి ఉత్తర్వులు రావలసిఉన్నది. స్థిరాస్తులైన భూమి, స్థలమునకు ఎటువంటి తరుగుదలను ఏర్పాటుచేయరాదు. ప్రుడెన్షియల్ నిబంధనల ప్రకారము ఏ ఆస్తి కూడా సున్నా విలువను చూపించకూడదు కావున స్థిరాస్తి ఉండేంతవరకు కనీస విలువ రూ. 1/- చూపించాలి. తరుగుదల పద్ధతులను ప్రతి సంవత్సరము మార్పు చేయరాదు. ఏకరూపత సాంప్రదాయము (Consistency) ప్రతి సంవత్సరము ఒకే పద్ధతి ప్రకారము తరుగుదలను లెక్కించాలి. అలా అని సర్దుబాటు వీలుపడదు అని అర్థముకాదు. మార్పు అవసరము అయితే మార్పు మరియు దాని ఫలితాలు స్పష్టముగా పేర్కొనబడాలి.

అయితే కొన్ని సందర్భాలలో వివిధ కారణాల వలన అంతకు ముందు సంవత్సరముల యందు తరుగుదలను ఏర్పాటు చేయని సందర్భములలో ఆడిటరు ప్రస్తుత సంవత్సరము తరుగుదలను మాత్రమే ఏర్పాటు చేయుచున్నారు. అది సరియైనది కాదు. ఈ విషయమునకు సంబంధించి వైద్యనాధన్ సిఫారసుల ప్రకారము తయారుచేసే స్పెషల్ ఆడిట్ నందు స్పష్టమైన ఆదేశములు జారీచేసియున్నారు. ఇందుకు సంబంధించి స్థిరాస్తి జీవితకాలము మరియు స్థిరాస్తిని సేకరించిన కాలమును దృష్టిలో ఉంచుకొని తరుగుదలను ఏర్పాటుచేయాలి. భవనాలకు సంబంధించి RCC నిర్మాణము అయితే జీవితకాలము 60 సంవత్సరాలుగా, కానప్పుడు 40 సంవత్సరాలుగా భావించి తరుగుదలను ఏర్పాటుచేసి ఆ మొత్తమును ప్రస్తుత సంవత్సరములో తరుగుదలగా చూపించాలి. ఉదాహరణకు భవనము RCC నిర్మాణముతో ఉండినప్పుడు, దాని విలువ రూ. 5,00,000/-లు అయినప్పుడు గత 3 సంవత్సములనుండి తరుగుదలను ఏర్పాటు చేయనప్పుడు క్రింది విధముగా తరుగుదలను లెక్కించవలయును.

Depreciation = Value of Building / Life of Building X Age of Building

= 5,00,000/- / 60 X 3

= 25,000/-.

కావున ప్రస్తుత సంవత్సరము భవనము మీద రూ. 25,000/-లను తరుగుదలగా లెక్కించాలి.

# ప్రగతిపథంలో గోగుంట విశాల సహకార పరపతి సంఘం, పెదపాడు మండలం

సేకరణ: **శ్రీ టి.సోమ్లా,**
డిప్యూటి రిజిస్ట్రార్/ప్రిన్సిపాల్
సహకార శిక్షణా కేంద్రం, విజయవాడ

పశ్చిమ గోదావరి జిల్లా, పెదపాడు మండలం, గోగుంట, శ్రీరామలింగేశ్వర విశాల సహకార పరపతి సంఘం ది.21.09.1929 న స్థాపించబడి ది.30.10.1929 తేది నుండి పని ప్రారంభించబడినది. ది. 31.03.2016 నాటికి 5666 మంది సభ్యులను, రూ.123.48 లక్షల షేరు ధనమును, రూ.1573.67 లక్షల డిపాజిట్లను కలిగిఉన్నది. పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఏలూరు వారి ఆర్థిక సహాయముతో మరియు సంఘ సొంత నిధులతో వ్యాపారము చేయుచున్నది. ఈ సంఘమునకు ఆఫీసు భవనము, బ్యాంకింగు కౌంటర్, స్ట్రాంగ్‌రూమ్, లాకర్లు, క్యాష్ కౌంటింగ్ మిషన్ వంటి అత్యాధునిక సౌకర్యములతోపాటు సెక్రటరీ క్వార్టర్స్‌ను కలిగి మరియు 350 ఎమ్.టి. సామర్థ్యం గల 2 గోడౌన్లను కలిగియున్నది. సంఘ గోదాములను బహిరంగ వేలము నిర్వహించి అద్దెకు ఇచ్చుట ద్వారా సంఘమునకు ఆదాయము వచ్చుటయేకాక సభ్యులు తమ పంట సరుకులను నిల్వచేసుకొనుటకు ఉపయోగకరముగా ఉన్నవి.

సంఘ సభ్యులకు రూ.1189.27 లక్షల వ్యవసాయ తదితర ఋణాలను, రూ.279.76 లక్షలు బంగారు ఆభరణముల హామిపై అప్పులను మరియు రూ. 43.28 లక్షలు డిపాజిట్ల హామిపై అప్పులను ఇవ్వడం జరిగినది. ఈ సంఘము 2015-16 సంవత్సరములో రూ.54.89 లక్షల నికర లాభమును ఆర్జించి, ఆడిట్ తరగతి 'A' గ్రేడ్ పొంది, నిరర్థక ఆస్తులు లేకుండ అనగా '0' గా వుండుట విశేషము. సంఘ సభ్యుల షేరుధనముపై 18% డివిడెండు పంచబడుతున్నది. అలాగే సంఘ సిబ్బందికి 2 నెలల జీతము బోనస్ కేటాయించడం జరిగినది. సంఘ లాభాల నుండి కేటాయించబడిన సాముదాయ ప్రయోజన నిధి (CGF) నుంచి జనతా ఇన్సూరెన్సు వర్తించని, దస్తావేజులు తాకట్టు పెట్టి అప్పులు నిల్వయున్న సభ్యులకు సహజ మరణము సంభవించిన ఒక్కొక్కరికి రూ.10,000/-లు చొప్పున ఇద్దరికి అంత్యక్రియల నిమిత్తము వారికుటుంబ సభ్యులకు మొత్తము రూ.20,000/- లు ఆర్థిక సహాయమును, అలాగే వసంతవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థుల త్రాగునీరు సౌకర్యార్థం ఆర్.ఓ. వాటర్ కొనుగోలు చేయుటకుగాను సంవత్సరమునకు రూ.1800/- లను, సంఘ ఏరియాలో అన్ని పాఠశాలలకు ఉచితంగా రూ.15,086/- ల విలువగల నోటు పుస్తకముల పంపిణీ, హేలాపూరి లయన్స్ క్లబ్ వారు తణుకులో నిర్మించుచున్న డయాలసిస్ యూనిట్ రూ.1,50,000/- లు, మన రాష్ట్ర నూతన రాజధాని అమరావతి నిర్మాణమునకు ప్రభుత్వము వారు ప్రకటించిన నా ఇటుక పథకమునకు రూ.1,00,000/-లు, సకలకొత్తపల్లి, కడిమికుంట గ్రామములోని ప్రాథమిక పాఠశాలల ఆవరణలో మెరక చేయుటకు రూ.34,000/-లు, వసంతవాడ హైస్కూలులో విద్యార్థులకు కుర్చీలు, బెంచీలకు అగు ఖర్చులో జిల్లా పరిషత్ వారు 50% మిగిలిన మొత్తము సంఘ వాటాగా 50%, రూ.70,000/- లు చెల్లించడం జరిగినది. అలాగే రాళ్ళపల్లివారిపాలెం గ్రామములోని వికలాంగుల మూడు చక్రముల వాహనమునకు రూ. 6500/-లు, మరియు వసంతవాడ పశువుల ఆసుపత్రి ఆవరణలో గ్రావెల్‌తో మెరక చేయించుటకు రూ. 26,300/- యివ్వడం జరిగినది. శ్రీ రామలింగేశ్వర విశాల సహకార పరపతి సంఘం గోగుంట సంఘ అధ్యక్షులుగా శ్రీ మేడూరి వెంకట సుబ్రహ్మణ్య కుటుంబశాస్త్రి M.Sc., (Tech.,), D.A.S గారు మరియు సంఘ కార్యదర్శిగా జయమంగళం రామారావు గారు వ్యవహరించుచున్నారు.

## సహకార విలువలు:

సహకార సంస్థలు విలువలతో కూడిన వ్యవస్థ. సామాజిక, ఆర్థిక, ఏకీభావం అనే విలువలను ఈ వ్యవస్థ అందిస్తుంది. సహకారం యొక్క ముఖ్య విలువలు విశ్వజనితంగా అనుసరించబడుతున్నాయి. గుర్తింపు ప్రకటన (1995) ప్రకారం సహకార సంస్థల్లో 'విలువలు' అనేవి స్వయం సహాయము, స్వయం బాధ్యత, ప్రజాస్వామ్యం, సమానత్వం, సమత, ఏకీభావం అనే విలువలపై ఆధారపడును. నిజాయితీ, నిష్కపటం, సాంఘిక బాధ్యత, పరోపకారం అనే నైతిక విలువలను సహకార సభ్యులు విశ్వసిస్తారు. సహకార విలువలు మరియు సహకార వ్యాపారముల మధ్య ఎలాంటి వైరమూ లేదు. ఇవి రెండు పరస్పర లక్ష్య సాధనలో కలసి పయనిస్తాయి.

# గ్రామీణ విద్యుదీకరణ - గ్రామీణ విద్యుత్ సహకార సంఘముల ద్వారా గ్రామీణాభివృద్ధి



సి.హెచ్. శ్యామ్‌సన్, డిఆర్ / లెక్చరర్
సహకార శిక్షణా కేంద్రం,
విజయవాడ

మన రాష్ట్రంలో సహకార రంగం అన్ని వ్యవస్థలలో, సమాజములోని అన్ని వర్గాలలోను విస్తరించియున్నది. మన రాష్ట్రంలో గ్రామీణ విద్యుత్ సహకార సంఘములు మూడు ప్రాంతాలలో విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి.

1. కుప్పం, చిత్తూరు జిల్లా.
2. చీపురుపల్లి, విజయనగరం జిల్లా
3. కశింకోట, అనకాపల్లి, విశాఖపట్నం

కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాలలో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర అవసరముల కొరకు సహకార విద్యుత్ సహకార సంఘముల ద్వారా కృషి చేయుచున్నది. గ్రామీణ విద్యుత్ రంగంలో మన దేశం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు, వాటి పరిస్థితి, గ్రామాలను గురించి కొన్ని విషయాలు చర్చించుకుందాం.

భారత్‌లో దాదాపు 80 శాతం (జన గణన 2011 ప్రకారం) జనాభా గ్రామాల్లోనే ఉంది. మొత్తం 16.78 కోట్ల నివాసగృహాల్లో 92,808,181 నివాసగృహాలకు మాత్రం విద్యుద్దీకరణ జరగ్గా 8,39,133 ఇళ్ళకు ఇంకా కరెంటు సుదూరంగా ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా విద్యుద్ధీకరణనే ఆధారంగా పరిగణిస్తారు.

గ్రామీణ విద్యుద్ధీకరణ విధానం (ఆర్ఈపీ)ను మొదటగా 2005లో ప్రకటించినపుడు 2009 నాటికి ఒక్కో నివాసగృహానికి ఒక యూనిట్ చొప్పున వినియోగం అంచనాతో అందరికీ 2012 నాటికి నిలకడగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటం సమర్థతకు గీటురాయిగా నిర్ధేశించారు. అయితే తాజా గణాంకాలను బట్టి చూస్తే ఇప్పటికీ లక్ష్యం దూరంగానే ఉండిపోయినట్టు కనిపిస్తుంది. విద్యుత్ సౌకర్యం ఉన్న గ్రామం అని ప్రకటించడానికి గల నిర్వచనాన్ని కూడా విధానంలో మార్పుచేశారు. గ్రామీణ విద్యుద్ధీకరణ విధానం ప్రకారం నివాసిత ప్రాంతాల్లో కనీసం ఒక దళిత బస్తీ / వాడకు విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్లు వంటి మౌళిక సదుపాయాలు కలిగి ఉండి, పాఠశాల, పంచాయతీ కార్యాలయం, ఆరోగ్య కేంద్రం, ఆస్పత్రి, కమ్యూనిటీ కేంద్రం వంటి వాటికి విద్యుత్ సౌకర్యం ఉన్నట్టు గ్రామ పంచాయతీ ధృవీకరణ కలిగిన గ్రామాన్నే విద్యుత్ సౌకర్యం గల గ్రామంగా గుర్తిస్తారు. అలాగే గ్రామంలో కనీసం 10 శాతం నివాసగృహాలకు విద్యుత్ సరఫరా ఉండాలి. ఆర్ఈపీలో ఇలా నిర్వచనాన్ని మార్చగానే గణాంకాల్లో పెద్దా తేడా కనిపించింది. విద్యుద్ధీకరణ లేని ప్రాంతాల సంఖ్య అమాంతరంగా పెరిగిపోయింది.

గ్రామీణ విద్యుత్ సహకార సంఘాల ద్వారా 2009 సం॥లో కేంద్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ విద్యుద్ధీకరణ యోజన (ఆర్.జీ.జీ.వీ.వై) దేశమంతా అమలు చేసింది. 2009 నాటికి అందరికీ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో విద్యుత్ చట్టం (ఈ.ఎ) 2003, గ్రామీణ విద్యుద్ధీకరణ విధానం 2005 తరహాలోనే సౌకర్యం కల్పించడానికి ఆర్.జీ.జీ.వీ.వై ని ఏప్రిల్ 2005లో ప్రకటించారు. దేశ వ్యాప్తంగా విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు / వాడలకు విద్యుద్ధీకరణ జరిపి ఆయా గ్రామీణ ప్రాంతాల్లో నివాస గృహాలన్నింటికీ విద్యుత్ సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నియమించిన గ్రామీణ విద్యుద్ధీకరణ కమీషన్ (ఆర్.ఈ.సీ) ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు జరిపారు.

గ్రామీణ విద్యుత్ సహకార సంఘముల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభించే సబ్సిడీలు, ఇతర సదుపాయాలను వినియోగించుకొని గ్రామీణ ప్రాంతాలలో విద్యుద్ధీకరణ జరుపుట కొరకు సహకార విద్యుత్ సంఘాలు ఎంతగానో కృషి జరుపుచున్నవి.

# "విషరహిత వ్యవసాయము" కోసం పాటుపడుదాం

భారతదేశము యొక్క వ్యవసాయరంగములో విపరీతముగా క్రిమిసంహారకమందులు వాడటం జరుగుతున్నది. దాని ఫలితముగా వ్యవసాయము విషతుల్యము అవుతున్నది. మరియు దాని ద్వారా పండించిన ఆహారమును తీసుకోవడము వలన మనుష్యులపైన దాని ప్రభావము విపరీతముగా పడుతుంది.

యూరియా, డి.ఎ.పి., విషమయమైన క్రిమిసంహారక మందులను తయారుచేయడము మొదలు పెట్టినది ఎవరు, మొట్టమొదటి సారిగా ప్రపంచంలో వీటిని తయారు చేసింది ఎవరు అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి సమాధానము ఏమిటంటే 1939 నుండి 1945 వరకు రెండవ ప్రపంచయుద్ధము జరిగింది. ఈ రెండవ ప్రపంచ యుద్ధంలో ఒకవైపు జర్మనీ, మరొకవైపు బ్రిటన్ ఉన్నాయి. బ్రిటన్‌కు సహకరించే దేశాలన్నీ ఒక వైపు, జర్మనీకి సహకరించే దేశాలు ఒకవైపు పాల్గొన్నాయి. ఈ యుద్ధములో లక్షలకోట్ల ఆయుధాలు విక్రయించబడ్డాయి. ఈ ఆయుధాలు తయారు చెయ్యడానికి రసాయనిక పదార్థాల అవసం ఏర్పడింది. ఈ రసాయనాలు తయారు చేయడానికి ఐరోపాలో ఎన్నో కర్మాగారాలు స్థాపించబడ్డాయి. వీటిద్వారా ఎన్నో రసాయనిక పదార్థాలు తయారు చేయబడి, రసాయనిక ఆయుధాలు తయారు చేయబడి రెండవ ప్రపంచ యుద్ధములో వినియోగించబడ్డాయి. 1946 లో రెండవ ప్రపంచ యుద్ధము ముగిసిన తర్వాత ఈ రసాయనిక కంపెనీలను కూడా మూసివేయవల్సి ఉంది. యుద్ధం ముగిసినా -రసాయనిక పదార్థాల ఉత్పత్తి మాత్రము ఆగలేదు. దీనికి కారణం ఈ కంపెనీలను మూసివేస్తే, వాటి ఉత్పత్తి అంతము అయితే లక్షల మంది నిరుద్యోగులు అవుతారు. అందువలన వీటి ఉత్పత్తిని కొనసాగించారు. యుద్ధం అయిపోయిన తర్వాత రసాయన పదార్థాలను ఎక్కడ వినియోగించవచ్చు అనే విషయాన్ని ఐరోపా దేశాలు ముఖ్యముగా బ్రిటన్ లాంటి దేశాలు పరిశోధనలు సాగించాయి. పరిశోధనల తర్వాత తేలింది ఏమిటంటే ఏ విషమయమైన రసాయన పదార్థాలు బాంబులు తయారు చేయడానికి వినియోగించారో అవే రసాయన పదార్థాలను వినియోగించి ఎరువులు, యూరియా, డిఎపి తయారుచెయ్యవచ్చు, పురుగులు, క్రిమి సంహారక మందులు తయారు చెయ్యవచ్చు అని తెలుసుకుని, ఈ ఉత్పత్తులను మరో వైపు తరలించడము జరిగింది. మొదట ఏ ఉత్పత్తులైతే బాంబులు తయారు చెయ్యడానికి, విషమయమైన రసాయనిక ఆయుధాలు తయారు చెయ్యడానికి ఉపయోగించబడ్డాయో, అవన్నీ తర్వాతకాలములో విషమయమైన రసాయనిక ఎరువులను తయారు చెయ్యడానికి క్రిమి సంహారకాలుగా, మరియు పురుగు మందులు తయారు చెయ్యడానికి వినియోగించబడ్డాయి. రసాయనిక ఆయుధాలు, బాంబు తయారు చెయ్యడానికి వినియోగించిన రసాయనిక పదార్థాలే ఎరువులు, క్రిమిసంహారక, డిఎపి, పురుగుల మందులు తయారు చెయ్యడానికి ఉపయోగపడ్డాయి. అవే కెమికల్స్ వాటిలో మార్పు లేదు. వాటి మోతాదులో మాత్రము కాస్త ఎక్కువ, తక్కువలు ఉన్నాయి. బాంబులు తయారు చెయ్యడానికి ఎక్కువ రూపంలో కాన్సన్‌ట్రేటెడ్ చేయబడతాయి. రసాయనిక ఎరువులను తయారీ చెయ్యడానికి అవే పదార్థాలు తక్కువ గాఢతతో తక్కువ మోతాదులో డైల్యూటెడ్ ఫామ్‌తో ఉపయోగించబడతాయి. అదే తేడా. పదార్థం మాత్రం రెండూ చోట్ల ఒక్కటే.

ఐరోపా మరియు అమెరికాలోని రసాయనిక పరిశ్రమలు అంతా యూరియా, డిఎపి మరియు క్రిమిసంహారక మందులు తయారు చెయ్యడంలో నిమగ్నమయి, ఎక్కువ ఉత్పత్తి చేశాయి. ఇప్పుడు అసలు సమస్య ఏర్పడింది వీటిని ఎక్కడ అమ్మాలని. అప్పుడు వీటిని భారతదేశములో విక్రయించడానికి పథకాలు రచించి 1950-60 దశాబ్దాలలో ఐరోపా దేశాల నుంచి ప్రతినిధులు వచ్చి, భారతదేశములో ప్రవేశపెట్టడం జరిగింది. క్రమముగా భారతదేశము మొత్తము విస్తరించబడ్డాయి. ఏ విధముగా అంటే మత్తు మందులు అలవాటు పడినవారు దానిని వదలలేనట్లే, రైతులు కూడా ఈ రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా వ్యవసాయము చేయలేని విధముగా తయారు అయ్యారు.

ఈ తతంగమంతా మొత్తముగా ఐరోపా కంపెనీలకు లాభం చేకూర్చటానికే. రెండవ ప్రపంచయుద్ధం కోసం తయారు చేయబడుతున్న రసాయనిక పదార్థాలను యుద్ధానంతరం ఏ విధంగా ఉపయోగించాలి అని వారు ఆలోచించి ఒకదానిని కనుక్కున్నారు. చివరకు అది భారతీయ వ్యవసాయ రంగంలో పొలాల్లోకి వచ్చి చేరింది. ఈ రసాయనిక ఎరువులు భారతదేశములోని లక్షలకోట్ల హెక్టార్లకు చేరుకుని రైతులను దెబ్బతీశాయి. ఈ విధంగా భారతదేశ వ్యవసాయము అంతా విషమయంగా తయారు అయింది. దేశమంతటా జరుగుతున్న ఈ విషమయ వ్యవసాయంతో భూమి పాడవుతుంది. మననీరు పాడవుతుంది. గాలి పాడవుతుంది. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. మన శరీరంలో విషము పెరుగుతుంది. మన దేశంలో విషం ఏస్థాయిలో పెరుగుతూ ఉందంటే ఢిల్లీలో ఎఐఎమ్ఎస్ వారు కొందరు తల్లులు ఇచ్చే పాలను పరిశీలించి చూస్తే ఆ పాలలో డిడిటి ఉంది. బాగా విషము పెరిగిపోయింది.

# జలమే జయ యజ్ఞము

నదుల అనుసంధానం దశాబ్దాలుగా చర్చల్లో నలుగుతోంది. అసమతుల వర్షపాతం కారణంగా అయితే కరువు లేకపోతే వరద అన్నట్లుగా తయారైన పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన బృహత్తర కార్యక్రమమిది. సమృద్ధిగా జలాలు అందుబాటులో వున్న ప్రాంతాల నుంచి తక్కువ నీరున్న చోట్లకు నీటిని తరలించి జాతీయ స్థాయిలో అసమానతలు తొలగించడమే ముందున్న పరిష్కారం. ఆ క్రమంలో మధ్యప్రదేశ్‌లోని కెన్ నదిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని బెట్వా నదితో అనుసంధానించడం ద్వారా దేశంలోనే తొట్టతొలి జాతీయ నదుల అనుసంధాన ప్రాజెక్టును పట్టాలెక్కించే దిశగా ఎన్‌డిఎ సర్కారు అడుగులు కదపడం హర్షణీయం. మరోవంక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ ఆవైపు చురుగ్గానే కదులుతోంది. గోదావరి జలాలను కృష్ణానదికి తరలించే కార్యక్రమాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం ముదావహం. వివిధ ప్రాంతాల సాగునీటి అవసరాలు సమర్ధంగా తీర్చే మహదాశయంతో ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమాన్ని ఆచి తూచి అమలు చేయాల్సి ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో సాగునీటి సౌకర్యం ఉన్న భూమి 2.26 కోట్ల హెక్టార్లు కాగా, పదకొండో పంచవర్ష ప్రణాళిక నాటికి అది 11.3 కోట్ల హెక్టార్లకు పెరిగింది. అవసరాలతో పోలిస్తే సాగు విస్తీర్ణంలో పెరుగుదల ఏ మూలకు సరిపోదు. దేశం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు సృజనాత్మక పరిష్కారంగా తెరమీదకు వచ్చిన నదుల అనుసంధాన కార్యక్రమాన్ని సవ్యంగా పట్టాలకు ఎక్కిస్తే అంతకు మించి కావలసింది లేదు.

**అన్నదాతకు వరం:**

దేశంలోని వివిధ నదీ వ్యవస్థల నుంచి లభిస్తున్న సగటు వార్షిక ప్రవాహ పరిమాణాన్ని 1,869 శతకోటి ఘనపు మీటర్లుగా అంచనాలేశారు. ద్వీపకల్ప నదుల వార్షిక ప్రవాహం పరిమాణంలో 8 శాతం కేవలం నాలుగు వర్షపు నెలల్లోనే లభిస్తున్నాయి. వివిధ సాంకేతిక ప్రతిబంధకాల వల్ల ఆ నీటిలో చాలా తక్కువ భాగమే అక్కరకు వస్తోంది. కేంద్ర జల సంఘం అంచనాల ప్రకారం నదుల్లో ప్రవహించే భూతల జలం ద్వారా 690 శ.కో.ఘనపు మీటర్లు, భూగర్భజలం ద్వారా 433 శ.కో. ఘనపు మీటర్లు అంటే మొత్తం 1123 శ.కో.ఘనపు మీటర్ల నీరు వినియోగానికి అందుబాటులో ఉంటోంది. దాదాపు 128 కోట్లుగా ఉన్న ఆహార ధాన్యావసరాలు అప్పటికి 45 కోట్ల టన్నులకు పెరగవచ్చని ఓ అంచనా. అందుకే భవిష్యత్తులో పెరిగే జనాభాకు తాగునీరు, కూడు, గుడ్డ అవసరాలు తీర్చడానికి అందుబాటులో ఉన్న అన్ని జలవనరులను పూర్తి స్థాయిలో వాడుకోవాలి. అమెరికా, ఆస్ట్రేలియావంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని జలాశయాల్లో తలసరి నీటి సామర్థ్యం 5000 ఘనపు మీటర్లు కాగా, భారత్‌లో అది కేవలం 500 ఘనపు మీటర్లు. అందువల్లే జల, ఆహార భద్రతకు విస్తృత కృషి కొనసాగాల్సి ఉంది. పరివాహక ప్రాంత జలవనరుల అభివృద్ధి వల్ల, ఒక నిర్ధిష్ట పరిమితికి మించి సాగుభూమి విస్తీర్ణాన్ని పెంచడం సాధ్యపడదు. మిగులు జలాలున్న ఇతర పరివాహక ప్రాంతాల నుంచి నీటిని మళ్ళించి ఉపయోగించుకోవాలి. అంతిమంగా దేశంలో లభ్యమయ్యే సాగునీటి అవసరాలతో పాటు దేశంలోని ప్రజలకు, పశు గణానికి తాగడానికి నీరు కావాలి. ఇప్పటికే దేశ రాజధానితో పాటు హైదరాబాదు, ముంబాయి, చెన్నై వంటి పెద్ద నగరాలకు దూర ప్రాంతాల నుంచి నీరు తరలించి, తాగునీటి అవసరాలు తీరుస్తున్నారు. జలధర్మల్ విద్యుదుత్పాదనకు, ఇతర పరిశ్రమలకు నీటి అవసరాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా నీటి కొరత ముమ్ముందు మరింత ముమ్మరించవచ్చు.

నానాటికి పెరుగుతున్న జనాభా కూడు, గుడ్డ అవసరాలను తీర్చాలంటే లభ్యమయ్యే నీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాలి. అందుకు అనేక స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి. వర్షపు నీటి సంరక్షణ, జల వినియోగ సామర్థ్యం పెంపుదల, భూతల, భూగర్భ జలాల సంయుక్త వినియోగం, సముద్ర జలాల క్షార రహిత ప్రక్రియ వంటివి కొన్ని స్వల్పకాలిక చర్యలు. భూగర్భజల కృత్రిమాభివృద్ధి, వీలైన నీటి నిర్వాహక చర్యలు, భారీ, మధ్య తరహా జలాశయాల నిర్మాణం, నదుల అనుసంధానం మొదలైన వాటిని దీర్ఘకాలిక చర్యలుగా పరిగణిస్తారు. వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి వనరుల్లోని అసమానతలను క్రమక్రమంగా తగ్గించడం ముఖ్యం. అందుకు మిగులు జలాలను నదీ పరివాహక ప్రాంతాలకు మళ్ళించాలన్నదే ప్రస్తుత ప్రక్రియ. దీనిపై కేంద్రం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ఆలోచిస్తున్నాయి.

మిగులు నుంచి తరుగు ప్రాంతాలకు నీటి తరలింపు కోసం జనవనరుల మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం 1980లోనే జాతీయ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాయి. అందులోని రెండు విభాగాల్లో ఒకటి హిమాలయ ప్రాంత నదుల అభివృద్ధి విభాగం, మరొకటి ద్వీపకల్ప నదుల అభివృద్ధి విభాగం.

**అనుసంధానం శ్రేయోదాయకం:**

ఎంతో క్లిష్టమైన అంతర రాష్ట్ర నదుల అనుసంధాన ప్రక్రియ కార్యరూపం దాల్చాలంటే సంబంధిత రాష్ట్రాలు పెద్ద మనస్సుతో సహకరించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం మరికొన్ని కీలక చర్యలు చేపట్టక తప్పదు. ముందుగా నేపాల్ భూభాగంలో గంగ ఉపనదులపై జలాషయాలు నిర్మించాలి. దేశంలో జల పంపిణీని క్రమబద్ధం చేయాలి. బంగ్లాదేశ్‌తో సంప్రదింపులు జరిపి, బ్రహ్మపుత్ర నీటిని గంగకు మళ్ళించేలా అనుసంధాన కాలువ తవ్వాలి. అప్పుడే దక్షిణ ప్రాంతానికి అందించేందుకు గంగలో తగిన నీరుంటుందని విశ్వసించి సంబంధిత రాష్ట్రాలు సహకారం అందచేస్తాయి. వీలైన చోట్ల చిన్న పాటి అనుసంధాన కాలువలను తవ్వడం ద్వారా ఈ బృహత్పథకానికి నాంది పలకాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. గోదావరి–కృష్ణ–పెన్న నదులను అనుసంధానిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం కుడికాలువ, ఉత్తర భారతంలో చేపట్టిన కెన్–బట్వానదుల అనుసంధాన ప్రక్రియలు ఈ బిన్న అనుసంధానాలకు ఉదాహరణలు. కేంద్రం చిత్తశుద్ధి, రాష్ట్రాల మధ్య సహకారం ఈ భగీరథ యత్నం సాఫల్యానికి అత్యవసరం.

హిమాలయ సంబంధిత విభాగంలో ముఖ్యమైన అంశాలు, భారత, నేపాల్‌లోని గంగ, బ్రహ్మపుత్ర ప్రధాన ఉప నదులపై జలాశయాలను నిర్మించి, గంగ, తూర్పు ఉపనదుల మిగులు జలాలను పచ్చిమ ఉపనదులకు మళ్ళించడం, దీని వల్ల 2.2 కోట్లు హెక్టార్లకు సాగునీటి సౌకర్యంతో పాటు మూడు వేల మెగావాట్ల జల విద్యుత్ ఉత్పాదన లభిస్తుంది. ద్వీపకల్ప నదుల అభివృద్ధి విభాగంలో ముఖ్య అంశాలు ఏవనగా మహానది – గోదావరి–కృష్ణ–పెన్నారు–కావేరీ నదుల అనుసంధానం, ఆ నదీ పరివాహక ప్రాంతాల్లో అనువైన చోట్ల జలాశయాల నిర్మాణం, ముంబాయికి దక్షిణాన, తాపీకి ఉత్తరాన పశ్చిమ దిశలో ప్రవహిస్తున్న నదుల అనుసంధానం, కెన్ చాంబల్ నదుల అనుసంధానం, పశ్చిమ దిశగా పారే ఇతర నదుల మళ్ళింపు. ఇందువల్ల అదనంగా 1.3 కోట్ల హెక్టార్ల భూమికి సాగు నీటి సౌకర్యంతో పాటు 400 మెగా వాట్ల జల విద్యుతుద్పాదన లభిస్తుందని అంచనా. జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రవాహం ఎక్కువగా ఉన్న 14 హిమాలయ నదులను, ప్రవాహం తక్కువగా ఉన్న 16 ద్వీపకల్ప నదులతో అనుసంధానించడానికి జాతీయ ప్రణాళిక రూపొందించింది. అంతర్ రాష్ట్ర నదుల అనుసంధాన ప్రక్రియ క్లిష్టమైనది. దీనికి సంబంధిత రాష్ట్రాలు సుహృద్భావంతో సహకరించాల్సి ఉంటుంది. మహా నదిలో తమ రాష్ట్రావసరాలకు మించి మిగులు జలాలు లేవని, బ్రహ్మపుత్ర, గంగ నదుల నుంచి మహా నదికి నీటిని మళ్ళించిన తరువాతనే గోదావరికి నీటి మళ్ళింపు సాధ్యమవుతుందని ఒడిసా ప్రభుత్వం చెబుతోంది. మహానది నుంచి నీరందిన తరువాతనే దిగువకు నీటి మళ్ళింపు సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ వాదిస్తోంది.

నదుల అనుసంధాన విషయములో మనరాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు దూర దృష్టితో పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రతిపదికపై నిర్మించి, దానికి ముందు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణ నదిలోకి అనతికాలములో పూర్తి చేసి గోదావరి జలాలు సముద్రములోనికి వెళ్ళకుండా కృష్ణా డెల్టా రైతులను ఆదుకొని కృష్ణా నది జలాలను రాయలసీమకు మరియు పెన్నానది ద్వారా నెల్లూరు జిల్లాకు నీరు ఇచ్చే ప్రయత్నము చేయుచున్నారు. మన ముఖ్యమంత్రి గారి ఆశయము ఒక్కటే. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకొని వాటిని సమగ్రమముగా సాగునీరు, త్రాగునీరు రాష్ట్రములో అందరికి అందచేయుటమే ప్రధాన లక్ష్యముగా "నీరు–ప్రగతి" అనే బృహత్తర కార్యక్రమము ద్వారా ప్రజలకు, రైతులకు అందచేయుట చాలా సంతోషదాయకము. నదుల అనుసంధానమే వ్యవసాయానికి ప్రగతి. రాబోవు రోజులలో మన రాష్ట్రములోని వ్యవసాయ భూములు నీటికి కొరత లేకుండా సమృద్ధిగా పంటలు పండి మంచి దిగుబడులు, మంచి ఆదాయముతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణము, చక్కని ఆరోగ్యముగా ఉంటుంది అని భావించుదాము.

**రావూరి శ్రీనివాసరావు,** లెక్చరర్
రామదాసు సహకార శిక్షణా కేంద్రం,
రాజమండ్రి

# 63వ అఖిల భారత సహకారవారోత్సవాలు

## అనంతపురం జిల్లా

### 14-11-2016

**తాడిపత్రి సబ్ డివిజను:** పుట్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణములో వారోత్సవ వేడుకలు అధ్యక్షులు శ్రీ డి. రాఘవరెడ్డిగారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీ వి.ఎ. శ్రీనివాసులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచి మేనేజర్ వీరభద్రప్రసాద్, సహకార శాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్ రమేష్ గార్లు పాల్గొని ప్రసంగిచారు.

**గుత్తి సబ్ డివిజను:** గుత్తి సబ్ డివిజను పరిధిలో గల పెద్ద వడుగూరు పి.ఎ.సి.యస్. ఆవరణములో వారోత్సవ వేడకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమములో సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీమతి రమణ మాధవి గారి పర్యవేక్షణలో సంఘ అధ్యక్షులు పి.రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన వారోత్సవ వేడుకలు నిర్వహించారు.

**ధర్మవరము డివిజన్:** ధర్మవరము సహకార డివిజను పరిధిలోని శెట్టూరు, తాడిమర్రి, డి. కొండాపురం ప్రాథమిక సహకార పరపతి సంఘములలో ఆయా ప్రత్యేక అధికారులు యస్. కుమార్. కె. బాలాజి, పి. శ్రీనివాసరెడ్డి గార్ల పర్యవేక్షణలో ఆయా అధ్యక్షులు పి. తిమ్మారెడ్డిగారు డి.గోవిందారెడ్డి, పి.ఐ.సి.యం. రాజశేఖర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

**హిందూపురము డివిజన్:** హిందూపురము డివిజను పరిధిలోగల రొళ్ళ, సోమఘట్ట, రొద్దం, తలుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆవరణములో ఆయా సంఘాల అధ్యక్షులు గౌరవనీయులు యం.వై.సంతోష్, యం. శ్రీనివాస రెడ్డి, పి. ఆంజనేయులు, పి.శ్రీనివాసరెడ్డి గార్ల అధ్యక్షతన సహకార శాఖ ప్రత్యేక అధికారులు శ్రీ పి.రామక్రిష్ణయ్య మరియు దాసు, రవి, మధుసూదన్ గార్ల పర్యవేక్షణలో వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### 16-11-2016

**తాడిపత్రి సబ్ డివిజన్:** తాడిపత్రి పట్టణ సహకార బ్యాంకు ఆవరణములో అధ్యక్షులు దద్దం సుబ్బరాయుడుగారు అధ్యక్షతన వారోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో యస్.డి.ఎల్.సి.ఓ. శ్రీవి.ఎ.శ్రీనివాసులు హాజరై ఆర్థిక వ్యవస్థపై, పరపతి విధానము పై ప్రసంగించారు.

**గుత్తి సబ్ డివిజను:** విడపనకల్ రైతు సేవా సహకార సంఘములో అధ్యక్షురాలు శ్రీమతి దేవీరమ్మ అధ్యక్షతన వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీమతి రమణ మాధవి ముఖ్య అతిథిగా విచ్చేసి వారోత్సవ వేడుకలపై ప్రసంగించారు.

**ధర్మవరము డివిజన్:** ధర్మవరము డివిజను పరిధిలో అనంతపురము జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కళ్యాణదుర్గం బ్రాంచిలో, రాయదుర్గం సహకార సెంట్రల్ స్టోర్సులో కనగానిపల్లి పి.ఎ.సి.యస్. ఆవరణములో సహకారవారోత్సవేడుకలు యస్.డి.ఎల్.సి.ఓ. నారాయణస్వామి, బి. చెన్నారెడ్డి, యం. సృజన్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు.

**హిందూపురము డివిజన్:** హిందూపురము పట్టణ సహకారం సంఘము, తలమర్ల పి.ఎ.సి.యస్. మల్లయ్య గారి పల్లి పి.ఎ.సి.యస్.లలో వారోత్సవ వేడుకలు డివిజనల్ సహకార అధికారి, యస్.డి.ఎల్.సి.ఓ. రవి.యస్.ఐ. మధుసుదన్ గార్ల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు.

### 17-11-2016

**రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం :** శిక్షణ కేంద్రంలో ప్రిన్సిపల్ యస్.యల్.రాజారెడ్డి గారి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు అనంతపురము డివిజనల్ సహకార అధికారి శ్రీమతి శైలకుమారి హాజరైనారు. ఈ వేడుకలలో విశ్రాంత ప్రిన్సిపాల్ సురేంద్ర రెడ్డిగారు, బ్యాంకు విశ్రాంత సి.ఇ.ఓ. వి. నరసింహారెడ్డి గారు, డి.ఆర్./ లెక్చరర్ పి. నారాయణస్వామి గారు, లెక్చరర్లు కె.వెంకటరామిరెడ్డి, బి. శ్రీనివాసులు గార్లు సంఘాల ద్వారా ప్రధాన ప్రభుత్వ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలు అనే అంశాలపై ప్రసంగించారు.

**తాడిపత్రి సబ్‌డివిజన్:** జూటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అధ్యక్షులు వై. వేణునాథరెడ్డిగారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలల్లో తాడిపత్రి సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీ వి.ఎ.శ్రీనివాసులు, సహకార శాఖ అధికారి శ్రీ రమేష్ గార్లు పాల్గొని సహకార సంఘాలలో ప్రభుత్వ పథకాల అమలు మరియు సంఘాల అభివృద్ధికి తీసుకోవలసిన కార్యక్రమాలపై ప్రసంగించారు. సంఘ కార్యదర్శి నరేంద్రరెడ్డి సంఘ ప్రగతిని వివరించారు.

**గుత్తి సబ్ డివిజను:** తొండపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘములో అధ్యక్షులు బి.లక్ష్మీరంగయ్యగారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమములో సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీమతి రమణమాధవి, ఎ.డి.సి.సి. బ్యాంకు గుత్తి బ్రాంచి మేనేజరు శ్రీ

జానకిరామిరెడ్డి, సంఘ సి.ఇ.ఓ. నరసింహులు పాల్గొన్నారు.

**ధర్మవరం డివిజను:** గొట్లూరు, చాపిరి, కణేకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ఆయా సంఘాల అధ్యక్షులు బి.రామాంజినేయులు, పి.తిమ్మారెడ్డి, యన్ మారెన్న గార్ల అధ్యక్షతన సహకార శాఖ పర్యవేక్షణ అధికారులు కె. బాలాజి, ఎన్. నారాయణస్వామి, రామక్రిష్ణ గార్ల అధ్వర్యంలో సహకార వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**హిందూపురము డివిజన్:** గోరంట్ల, నల్లమాడ, అమరాపురము, గూనిపల్లి ప్రాథమిక సహకార సంఘాలలో పర్యవేక్షణ అధికారులు శ్రీమరియదాసు, మధుసూదన్, బాబాపక్రుద్దీన్, యం. రవి ఆధ్వర్యంలో ఆయా సంఘాల అధ్యక్షులు జి.వెంకటరమణారెడ్డి, యస్. రాజశేఖరరెడ్డి, ఎన్.ఆర్. హనుమంతరాయప్ప, సి. చెన్న క్రిష్ణారెడ్డి అధ్యక్షతన వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**18-11-2016**

**తాడిపత్రి సబ్‌డివిజన్:** యాడికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో అధ్యక్షులు శ్రీ కె.నీలకంఠారెడ్డి అధ్యక్షతన వారోత్సవవేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సబ్ డివిజనల్ సహకార అధికారి శ్రీ వి.ఎ. శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

**రాయలసీమ సహకార కేంద్రం:** ధర్మవరము డివిజనల్ సహకార అధికారి శ్రీ శ్రీనివాసరెడ్డి గారు, అనంతపురము జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సి.ఇ.ఓ.కె. విజయచంద్రారెడ్డి, విశ్రాంత సి.ఇ.ఓ. మేములేటి నరసింహ్మారెడ్డి హాజరైనారు. ప్రిన్సిపాల్ యస్.యల్. రాజారెడ్డి గారు అధ్యక్షతవహించగా అధ్యాపకులు పి.నారాయణస్వామి,కె.వెంకటరామిరెడ్డి, బి. శ్రీనివాసులు సాంకేతికత స్వీకరణ అంశాలపై ప్రసాంగించారు.

**ధర్మవరము డివిజను:** యం.హనుమాపురము, బండమీదపల్లి, ధర్మాంభ సహకార స్టోర్సులో ఆయా సంఘాల అధ్యక్షులు శ్రీ కె.జి. రామిరెడ్డి, శ్రీమతి పి. పార్వతమ్మ, పి.వి.సి.యం. రాజశేఖర్ గార్ల అధ్యక్షతన వేడుకలు జరిగాయి.

**హిందూపురము డివిజను:** హిందూపురం సెంట్రల్ స్టోర్సు, కదిరి సెంట్రల్ స్టోర్సు, జిల్లా సహకార మార్కెటింగ్ శాఖలు హిందూపురం, మడకశిర ఆయా ప్రత్యేక అధికారులు శ్రీ రుద్రప్రసాద్‌రెడ్డి, ముని క్రిష్ణారెడ్డి, మధుసూదన్, బాబా ప్రకృద్దీన్ గార్ల పర్యవేక్షణలో సహకార వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**19-11-2016**

**తాడిపత్రి సబ్‌డివిజన్:** తాడిపత్రి గృహనిర్మాణ సహకార సంఘంలో అధ్యక్షులు శ్రీ ఆకుల చంద్రశేఖర్ గారి అధ్యక్షతన వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యస్.డి.యల్.సి.ఓ.వి.ఎ. శ్రీనివాసులు, ఎ.డి.సి.సి. బ్యాంకు మేనేజరు శ్రీ కె. వీరభద్ర ప్రసాద్ హాజరైనారు.

**గుత్తి సబ్‌డివిజను:** పెద్దకౌకుంట్ల పి.ఎ.సి.యస్ ఆవరణములో సంఘ పి.ఐ.సి. శ్రీనివాసులు, యస్.డి.యల్.సి.ఓ. రమణమాధవి గార్లు హాజరై వారోత్సవాల ప్రాముఖ్యత, సహకార సంఘాల ద్వారా మహిళలు, యువత మరియు బలహీన వర్గాల సాధికారత పై ప్రసంగించారు.

**ధర్మవరము డివిజను:** రామగిరి, బైరావన తిప్ప, కలగోడు ప్రాథమిక సహకార సంఘాలలో ప్రత్యే అధికారులు కె. బాలాజి, యస్. నారాయణ స్వామి, బి.రామక్రిష్ణయ్య గార్ల పర్యవేక్షణలో అధ్యక్షులు అధ్యక్షతవహించగా ఆయా సంఘాల సభ్యులు, పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు, సహకార శాఖ అధికారులు తదితరులు పెద్ద ఎత్తున హాజరై వారోత్సవవేడుకలు జయప్రదంగావించారు.

**హిందూపురము డివిజన్:** బూరలి, మండలపల్లి, కొత్తచెరువు, గాండ్లపెంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో ప్రత్యేక సహకార శాఖ అధికారులు శ్రీ మరియ దాస్, బాబా ఫకృద్దీన్, రవి, మధుసూదన్ గార్ల పర్యవేక్షణలో ఆయా సంఘాల అధ్యక్షతన వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**20-11-2016**

**తాడిపత్రి సబ్‌డివిజను:** డి.సి.యం.యస్. బ్రాంచి అవరణములో సబ్‌డివిజనల్ సహకార అధికారి శ్రీ వి.ఏ.శ్రీనివాసులు గారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

**ధర్మవరము డివిజను:** కంబదూరు, ధర్మవరము పట్టణసహకార బ్యాంకు, గుమ్మగట్ట రైతు సేవా సహకార సంఘాలలో వారోత్సవాల ముగింపు వేడుకలు ఆయా ప్రత్యేక అధికారులు యస్. కుమార్, యం. రాజశేఖర్, మరియు పి. శ్రీనివాసరెడ్డి గార్ల పర్యవేక్షణలో ఆయా సంఘాల అధ్యక్షులు అధ్యక్షతన సుస్థిరపాలన నాయకత్వం మొదలగు అంశాలపై వేడుకలు నిర్వహించారు.

**హిందూపురము డివిజను:** గౌనివారిపల్లి, బుక్కపట్నం, పి.కె.వి.పల్లి, పెడపల్లి ప్రాథమిక సహకార సంఘాలలో ఆయా అధ్యక్షులు సర్వశ్రీ పి.ఉత్తంరెడ్డి, జి. ప్రభాకర్ రెడ్డి, ఎ.వి.రమణా రెడ్డి గార్ల అధ్యక్షతన ఆయా సబ్‌డివిజనల్ సహకార అధికారులు, మరియదాసు, మధుసూదన్, రవిగార్ల ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కామన్ అకౌంటింగ్ సిస్టం క్రింద వ్రాయవలసిన రిజిష్టర్లు - పుస్తకాలు

వి. శ్రీనివాస్
ప్రిన్సిపాల్, ఆర్‌సిటిసి, రాజమహేంద్రవరం

**పరిచయం:**

సంఘము నిర్వహించే ఖాతా పుస్తకములు ఖచ్చితమైన గణక సిద్ధాంతాలకు మరియు సంఘము అనుసరించు విధానాలకు అనుగుణంగా తగు రీతిగా వ్యవహారముల నమోదు ఒకే రీతిగా ఉండాలి. సి.ఎ.ఎస్. విధానము క్రింద సూచించిన ఖాతా పుస్తకాలన్నియు ప్రమాణీకరింపబడినందున ఆడిట్ పర్యవేక్షణకు ఇతర సంస్థలతో పోల్చుటకు సౌకర్యముగా నుండును.

**రిజిష్టర్లు మరియు ఖాతా పుస్తకాలు:**

ఖాతాల నిర్వహణ అంటేనే ప్రతిరోజు వ్యాపార వ్యవహారాలు పుస్తకాలలో ఒక పద్ధతి ప్రకారం, ప్రమాణికంగా నమోదు చేయుటకు సూచించబడిన ఖాతా పుస్తకాల సమాహారము. సిఎఎస్ క్రింద సంఘములకు సూచించిప ఖాతా పుస్తకాలు రెండు రకాలు అవి 1) ప్రథమ / ప్రాథమిక నమోదు పుస్తకాలు. అవి, బ్యాంకు పుస్తకం, నగదు పుస్తకం, డే బుక్ మొదలైనవి; 2) అనుబంధ ఖాతా పుస్తకాలు అవి, సాధారణ ఆవర్జా, మరికొన్ని ఇతర రిజిష్టర్లు, పుస్తకాలు.

**సహాయక ఆవర్జాలు (సబ్సిడియరీ లెడ్జర్స్):**

సంఘాలు సభ్యులనుండి మూలధనాన్ని సేకరించును. అవి వివిధ రకాల రుణాలను అనగా పంట రుణాలు మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు, వివిధ అవసరాలకు వ్యక్తిగత రుణాలు, వినిమయ రుణాలు, మార్కెటింగ్ క్రెడిట్ డిపాజిట్, అప్పులు, బంగారు ఆభరణాలపై అప్పులు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు మొదలైనవి ఇచ్చును. అదే విధంగా అవి అనేక రకాల డిపాజిట్లను కూడా సేకరించును. అవి సేవింగ్స్ బ్యాంకు ఖాతా, రికరింగ్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్టు ఖాతా, ప్రత్యేక డిపాజిట్టు ఖాతాలు మొదలగునవి.

అందుచేత వ్యవహారాల సాంద్రత పెరిగి ఒక పుస్తకంలో వాటిని వ్రాయుటకు వీలులేనందున ఖాతాల నిల్వలు సమన్వయ పరచుటకు వీలుకానందున వివిధ ఖాతాలకు సంబంధించి అనేక రకాల ఖాతా పుస్తకాలు వ్రాయవలసి ఉన్నది.

సంఘం ఆర్థిక నివేదికలు అంటే వర్తక ఖాతాను, లాభనష్టాల ఖాతాను, బ్యాలన్సు షీటు తయారు చేసుకొనుటకు అన్ని లెడ్జర్లు మరియు కొన్ని రిజిష్టర్లు ఉపయోగపడతాయి. ఇతర రిజిష్టర్లు అన్ని నియంత్రించు రిజిష్టర్లు. అవి అనుబంధ సమాచారంతో కూడనివి. ప్యాక్స్ వీటన్నింటిని ఉపయోగించి అవసరమైనపుడు అనేక రకాల గణాంక నివేదికలను తయారు చేయవచ్చును. ఈ రిజిష్టర్లు ఆర్థిక పట్టికలతో సంబంధంలేనివి. రిజిష్టర్లు, ఆవర్జాల పేర్లు ఈ క్రింద వ్రాయబడినవి.

**ఎ) రిజిష్టర్లు/ఆవర్జాలు (ఆర్థిక పట్టికలతో సంబంధం గలవి):**

1) వాటా మూలధన ఆవర్జా, 2) సేవింగ్స్ ఖాతా ఆవర్జా 3) ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆవర్జా 4) రికరింగ్ డిపాజిట్ ఆవర్జా 5) పునః పెట్టుబడి ఆవర్జా 6) నెలసరి వడ్డీ చెల్లించు రిజిష్టరు 7) బారోయింగ్స్ రిజిష్టరు 8) నగదు పుస్తకం 9) బ్యాంకు పుస్తకం 10) పెట్టుబడుల రిజిష్టరు 11) అప్పు ఆవర్జా 12) అప్పు ఆవర్జా 13) బంగారు ఆభరణాలపై యిచ్చు రుణ ఆవర్జా 14) పంటకుదువ పై అప్పు ఆవర్జా 15) అప్పు పంపిణీ రిజిష్టరు 16) ఫర్నీచర్, బిగింపులు, ఆఫీసు పరికరాలు మరియు ఇతర చరాస్తుల రిజిష్టరు 17) భూమి మరియు భవనాల రిజిష్టరు 18) తరుగుదల పట్టిక

వివిధ రుణగ్రస్తులు & రుణదాతలు: 19) వివిధ రుణగ్రస్తుల ఆవర్జా 20) వివిధ రుణదాతల ఆవర్జా 21) స్టాకు రిజిష్టరు 22) కొనుగోళ్ళు మరియు అమ్మకాల రిజిష్టరు 23) సేఫ్ డిపాజిట్ లాకర్ వ్యవహారాల రిజిష్టరు

**బి) నియంత్రణ రిజిష్టర్లు (ఆర్థిక నివేదికలతో సంబంధం లేనివి):**

1) సభ్యత్వ రిజిష్టరు, 2) ఖాతాలను ప్రారంభించు మరియు మూసివేయు రిజిష్టరు, 3) అప్పు వాయిదా తెలుపు రిజిష్టరు, 4) కాలపరిమితి, రికరింగ్, తిరిగిపెట్టుబడుల గడువును తెలిపే రిజిష్టర్, 5) అమలులో లేని ఖాతాలు తెలుపు రిజిష్టరు, 6) తెచ్చిన అప్పుల వాయిదా తేదీ తెలుపు రిజిష్టరు, 7) పెట్టుబడుల పరిపక్వత తెలుపు రిజిష్టరు, 8) బంగారు వస్తువుల స్టాకు రిజిష్టరు, 9) తాకట్టు స్టాకు రిజిష్టరు, 10) రుణం అందిన సంగతిని తెలియపరిచే రిజిష్టర్, 11) వ్యాజ్యాలు వేసిన వివరాల రిజిష్టరు, 12) డి.సి.బి. రిజిష్టరు, 13) వాయిదా మీరిన / ఎన్.పి.ఎ. రిజిష్టరు, 14) బీమా రిజిష్టరు 15) వ్యక్తిగత / ఏజెన్సీ వారిగా రుణగ్రస్తులు మరియు రుణదాతల రిజిష్టరు, 16) నిల్వలు తేల్చు రిజిష్టరు

# 63వ అఖిల భారత సహకార వారోత్సవాల దృశ్యమాలిక



సహకార పతాకన్ని ఆవిష్కరిస్తున్న సంఘ అధ్యక్షులు జి.డి.సి.సి.బ్యాంకు డైరెక్టరు శ్రీ వి.సర్వేశ్వరరావు గారు, చిత్రములో శ్రీ సియచ్.పురుషబాబు డిఎల్‌సిఓ నర్సరావుపేట, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ ఎ.రత్నాకరరావు తదితరులు



సహకార వారోత్సవాల సందర్భంగా డిసిసిబి విశాఖపట్నం నందు పతాకం ఆవిష్కరణ చేయుచున్న శ్రీ యు. సుకుమార్ వర్మ గారు బ్యాంకు సిఇఓ శ్రీ ఎ.వీరబాబు గారు,శ్రీ డి.వి.ఎస్.వర్మ గారు,జనరల్ మేనేజర్ తదితరులు



సహకార వారోత్సవములలో ప్రసంగించున్న డా॥ డి.పాండురంగారావు గారు డిసిఓ చిత్రములో శ్రీ. సి.యచ్.పురుషబాబు డిఎల్‌సిఓ నర్సరావుపేట శ్రీ ఎ .శ్రీనివాస రావు అధ్యక్షులు శ్యావల్యాపురం పిఎసిఎస్



20-11-2016 అఖిలభారత భారత సహకార వారోత్సవాలు ఉత్తమ ఉద్యోగి గా అవార్డు అందుకున్న Steel plant Employees Coop. thrift&credit society Chief Manager శ్రీ బి.సుందరరావు గారు




చిత్రములో ఉన్నవారు శ్రీమతి. ఇ.రత్నావతి. డిఎల్‌సిఓ, తెనాలి. అసిస్టెంట్ రిజిస్ట్రారు శ్రీ యలమందరావు, తెనాలి యస్‌డియల్‌సిఒ శ్రీ కె.వి.వి .ఆంజనే యులు, ఆడిటరు శ్రీ.యు.వి. నారాయణ, సంఘ అధ్యక్షులు శ్రీ నందిపాటి జోగా రావు



సహకార వారోత్సవాలు 20న Steel plant Employees Coop.thrifit&credit society నందు ప్రసంగిస్తున్న శ్రీ వి.గౌరి శంకర్ గారు జె.ఆర్/డి.సి.ఓ విశాఖపట్నం

# 63వ అఖిల భారత సహకార వారోత్సవాల దృశ్యమాలిక



నవంబరు 19వ తేదీన మచిలీపట్నం ఓగీస్‌పేట కమ్యూనిటీ హాలు వద్ద సహకార పతాకాన్ని ఆవిష్కరించిన కృష్ణా జిల్లా డి.సి.ఓ శ్రీ ఎన్.వి.ఆర్. ఆనంద బాబు గారు.




నవంబరు 19వ తేదీన మచిలీపట్నం ఓగీస్‌పేట కమ్యూనిటీ హాలులో జరిగిన మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తున్న కృష్ణా జిల్లా డి.సి.ఓ శ్రీ ఎన్.వి.ఆర్. ఆనంద బాబు గారు, చిత్రంలో మచిలీపట్నం డి.ఎల్.సి.ఓ. శ్రీ ఎమ్. రవికుమార్, మెప్మా అధికారి శ్రీ ఎమ్.ఇ. ఫణికుమార్.




నవంబరు 20వ తేదీన కృష్ణా జిల్లా కోడూరు మండల కేంద్రంలో జరిగిన సహకార వారోత్సవ సభలో ప్రసంగిస్తున్న కె.డి.సి.సి. బ్యాంకు డైరెక్టర్ శ్రీ ముద్దినేని చంద్రరావు. చిత్రంలో మచిలీపట్నం డి.ఎల్.సి.ఓ. శ్రీ ఎమ్. రవికుమార్,ఇతర అధికారులు.



నవంబరు 17వ తేదీన కృష్ణా జిల్లా చెక్కపల్లి పి.ఎ.సి.యస్. వద్ద సహకార పతాక వందనం చేస్తున్న నూజివీడు డి.ఎల్.సి.ఓ. శ్రీ ఎమ్. భైరామూర్తి గారు, సంఘ అధ్యక్షులు శ్రీ కె. రాజానాయన తదితరులు.




నవంబరు 20వ తేదీన కృష్ణా జిల్లా కోడూరు మండల కేంద్రంలో జరిగిన సహకార వారోత్సవ సభలో ప్రసంగిస్తున్న మచిలీపట్నం డి.ఎల్.సి.ఓ. శ్రీ ఎమ్. రవికుమార్. చిత్రంలో కె.డి.సి.సి. బ్యాంకు డైరెక్టర్ శ్రీ ముద్దినేని చంద్రరావు, ఇతర అధికారులు.




నవంబరు 15వ తేదీన కృష్ణా జిల్లా కవుతరం పి.ఎ.సి.యస్. వద్ద జరిగిన వారోత్సవ సభలో ప్రసంగిస్తున్న గుడివాడ డి.ఎల్.సి.ఓ. శ్రీ సయ్యద్ మస్తాన్ వలీ గారు.


Printed. Published, Owned by : ANDHRA PRADESH STATE COOPERATIVE UNION LTD.,
Beside Sundaraiah Vignana Kendram, A.P. Housefed Building, 2nd Floor, Baghlingampally, Hyderabad. Phone : 040-27674148